

నేటి నుంచి పీజీఆర్ఎస్: కలెక్టర్

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) సోమవారం నుంచి యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జనవరి 29 నుంచి పీజీఆర్ఎస్ రద్దయింది. కోడ్ ముగియడంతో సోమవారం నుంచి వినతుల స్వీకరణ ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కాగా జీవీఎంసీలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహిస్తున్నట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు.

బీచ్ రోడ్డులో ఆక్రమణల దందా!

జీవీఎంసీ పార్కింగ్ స్థలాల్లో భారీషెడ్ల నిర్మాణం

- పెద్దఎత్తున దుకాణాల ఏర్పాటు
- వ్యాపారులకు లీజుకు ఇస్తున్నవైనం
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

బీచ్‌రోడ్డులో ఆక్రమణలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. పార్కింగ్ కోసం జీవీఎంసీ కేటాయించిన స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసేసి, అక్కడ ప్రజాప్రతినిధుల ఫొటోలు పెట్టి మరీ ఇతరులకు లీజుకి ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఆక్రమణదారులకు భారీగా ఆదాయం సమకూరుతున్నా, జీవీఎంసీ ఖజానాకు ఒక్క రూపాయి కూడా జమ కావడం లేదు. పైగా ఈ స్థలాలు ఒక్కొక్కటిగా ఆక్రమణలకు గురవుతుండడంతో బీచ్‌రోడ్డులో పార్కింగ్ సమస్య తలెత్తుతోంది.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా బీచ్‌రోడ్డులో ఆక్రమణలకు అడ్డుకట్టపడడం లేదు. కొంతమంది దళారీలు జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా బీచ్‌రోడ్డులో ఖాళీస్థలాలు, పార్కింగ్ స్థలాల్లో దుకాణాలను ఏర్పాటుచేస్తున్నారు. వాటిజోలికి ఎవరూ రాకుండా తమకు అస్మదీయులైన ప్రజాప్రతినిధుల ఫొటోలను అక్కడ ఏర్పాటు చేస్తున్నారు. తర్వాత వాటిని వ్యాపారులకు అద్దెలకు ఇచ్చి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

వాహనాలకు పార్కింగ్ కరవు...

బీచ్‌రోడ్డులో రోజురోజుకీ ఆక్రమణలు పెరిగిపోతుండడంతో బీచ్‌కు వచ్చే సందర్శకులు, పర్యాటకులకు ఇబ్బందికరంగా మారుతోంది. మరోవైపు పార్కింగ్ స్థలాల్లో దుకాణాలను ఏర్పాటు చేస్తుండడంతో వాహనాలను రోడ్డుపైనే నిలిపేస్తున్నారు. ఇది బీచ్‌రోడ్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో పాటు ట్రాఫిక్ జామ్‌లకు దారితీస్తోంది. దీనిపై జీవీఎంసీ, పోలీస్ అధికారులకు ఫిర్యాదులు అందుతుండడంతో ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్టు జీవీఎంసీ, పోలీస్‌శాఖ అధికారులు పలుమార్లు ప్రకటించినా ఆచరణలోకి రావడంలేదు. తాజాగా బీచ్‌రోడ్డులో అమీబాపార్కు, సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్ మధ్య ఉన్న పార్కింగ్ స్థలంలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఒకరు భారీగా షెడ్‌ను ఏర్పాటుచేశారు. దానిచుట్టూ కొందరు రాజకీయనేతల ఫొటోలు పెట్టి అటువైపు అధికారులు ఎవరూ రాకుండా జాగ్రత్తపడ్డారు. షెడ్‌ను ఏర్పాటు చేసిన తర్వాత దానిని వేరొకరి అద్దెకు ఇచ్చేయడంతో అందులో ప్రస్తుతానికి హైదరాబాదీ హలీమ్‌హౌస్ పేరుతో దుకాణం ప్రారంభించారు. అదే షెడ్‌లో హైదరాబాద్ బిర్యానీ పేరుతో కూడా విక్రయాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. దీనిపై కొందరు శనివారం జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో నిర్వాహకులు హడావుడిగా షెడ్‌లపై ఉన్న బోర్డులను, షెడ్‌ముందు ఏర్పాటుచేసిన కార్పెట్‌లను తొలగించడం చర్చనీయాంశంగా మారింది.



కోస్టల్ బ్యాటరీ సమీపంలో హలీం షాప్



సిల్వర్‌స్పూన్ వద్ద ఏర్పాటు చేస్తున్న షెడ్డు

గోకుల పార్కు సమీపంలో...

అదేమాదిరిగా బీచ్‌రోడ్డు గోకులపార్కు పక్కన తీరం వైపు సీపెరల్ క్యాంటీన్ పక్కనే ఉన్న పార్కింగ్ స్థలంలో మరొకరు రాత్రికి రాత్రే భారీషెడ్‌లు ఏర్పాటుచేశారు. జీవీఎంసీ నుంచి అనుమతి తీసుకోకుండానే అందులో వ్యాపారాలను కూడా ప్రారంభించేశారు. షెడ్ పరిసరాల్లోకి అధికారులెవరూ రాకుండా కూటమి నేతల ఫొటోలను ఏర్పాటుచేశారు. దీనిపై కూడా కొందరు శనివారం ఫిర్యాదు చేయడంతో షెడ్‌చుట్టూ ఏర్పాటుచేసిన నేతల ఫొటోలను తొలగించేశారు.

చర్యలపై తాత్సారమెందుకో?

జీవీఎంసీ అనుమతి లేకుండా దుకాణాలు ఏర్పాటుచేస్తే తక్షణం చర్యలు తీసుకోవాల్సిన జీవీఎంసీ అధికారులు ఎందుకు అటువైపు చూడడం లేదనేదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా పార్కింగ్‌కు కేటాయించిన స్థలాను ఇష్టారాజ్యంగా ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేస్తే బీచ్‌రోడ్డుకు వచ్చే సందర్శకులతో పాటు ఆయా దుకాణాలకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేసుకుంటారనే దానిపై అధికారులు దృష్టిసారించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ, పోలీస్‌శాఖల అధికారులు సంయుక్తంగా ఆక్రమణలపై కొరడా ఝుళిపించాలని నగరవాసులు కోరుతున్నారు.

కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీ

అనారోగ్య సమస్యతో చేరితే జేబు గుల్లే

- రూ.లక్షలు వసూలు చేసి, చివరికి మరో ఆస్పత్రికి రిఫర్
- నగరంలోని అనేక ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి
- రోగుల బంధువుల ఆందోళనలతో బయట పడుతున్నవి కొన్ని మాత్రమే
- గుట్టుగా చక్కబెడుతున్న కేసులకు లెక్కే లేదు

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): 'కేజీహెచ్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కొద్దిరోజుల కిందట ఆయాసంతో బాధపడుతున్న వృద్ధురాలిని కుటుంబసభ్యులు చేర్చారు. పది రోజులపాటు చికిత్స చేసిన వైద్యులు సుమారు రూ.12 లక్షల బిల్లు వసూలు చేశారు. ఆరోగ్యం కుదుటపడుతోందని చెప్పారు. బిల్లు మొత్తం చెల్లించుకున్న తరువాత పరిస్థితి చేయిదాటిపోయిందని మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. రోగి కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తరలించగా కేవలం రెండు గంటల్లోనే వృద్ధురాలు మరణించింది.

'గాజువాకలోని మరో ఆస్పత్రిలో ఇటీవల 55 ఏళ్ల వ్యక్తి అనారోగ్యంతో చేరారు. రెండు వారాలపాటు చికిత్స చేసి వైద్యులు సుమారు రూ.3 లక్షలు వసూలు చేశారు. తీరా ఆయాసం పెరుగుతోందని కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలంటూ చేతులెత్తేశారు. తీరా కేజీహెచ్‌కు తరలించిన నాలుగు గంటల్లోనే రోగి మృతిచెందారు. రోగి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని రూ.లక్షల్లో వసూలు చేసి చివరి నిమిషంలో ఇలా మరో ఆస్పత్రికి రిఫర్ చేయడంపై రోగుల బంధువులు మండిపడుతున్నారు.

నగర పరిధిలోని పలు కార్పొరేట్ ఆస్పత్రులు రోగులను నిలువునా దోచుకుంటున్నాయి. అనారోగ్య సమస్యతో చేరే రోగుల నుంచి రూ.లక్షలు వసూలు చేసే వరకు డిశ్చార్జ్ చేయడం లేదు. కనీసం రెండు, మూడు లక్షలు బిల్లు కావాల్సిందే అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. మరికొన్ని కేసుల్లో వ్యవహరిస్తున్న తీరు జుగుప్సను కలిగిస్తోంది. రోజుల తరబడి చికిత్స అందించి, రూ.లక్షలు వసూలు చేసి, రోగి ప్రాణాలకు ప్రమాదమని గుర్తిస్తే అత్యవసర పరిస్థితిని క్రియేట్ చేసి, మరో సమస్య తిరగబెట్టిందని, దానికి వైద్యం అందించే పరికరాలు లేవని మరో ఆస్పత్రికి



పంపిస్తున్నారు. అప్పటివరకు రూ.లక్షలు ఖర్చు చేసిన రోగి కుటుంబసభ్యులు మరో ఆస్పత్రికి తీసుకువెళ్లే స్థోమత లేక కేజీహెచ్‌ను ఆశ్రయిస్తున్నారు. వీరిలో చాలా మంది 24 గంటల వ్యవధిలోనే మృత్యువాత పడడం గమనార్హం.

డబ్బే పరమావధి..

కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు డబ్బే పరమావధిగా భావిస్తున్నాయి. రూ.లక్షలు వసూలు చేసినప్పటికీ రోగి బంధవులకు అసలు విషయాన్ని చెప్పడం లేదు. పరిస్థితి మెరుగవుతోందని, కోలుకుంటున్నారని చెప్పేస్తున్నారు. కనీసం రోగిని చూడనీయడం లేదు. కొన్ని ఆస్పత్రులు ఒక్కో రోగి నుంచి ఇంతమొత్తం వసూలు చేయాలని వైద్యులకు టార్గెట్లు విధిస్తున్నాయి. ఆ లక్ష్యం చేరిన తరువాత సీరియస్ నెస్ క్రియేట్ చేసి, చేతులు దులుపుకుంటున్నారు. కోలుకునే అవకాశం ఉందని భావించే కేసులకు తుది వరకు వైద్య సేవలు అందించి మరిన్ని లక్షలు పిండేస్తున్నారు. అంతేకాదు చివరిదశలో మరో ఆస్పత్రికి వెళ్లాలని చెప్పడం వెనుక వేరే కారణాలున్నాయని చెబుతున్నారు. రోజుల తరబడి వైద్యం చేసి రూ.లక్షలు వసూలు చేసిన తరువాత రోగి చనిపోతే గొడవలు జరుగుతాయని, ఆస్పత్రి పరువు పోతుందని, కొన్నిసార్లు వసూలు చేసిన డబ్బు తిరిగి ఇవ్వాల్సి ఉంటుందనే తప్పించుకునేందుకు ఈ తరహా డ్రామాలకు దిగుతున్నారని సమాచారం.

రహస్యంగా వైద్యం..

నగర పరిధిలోని ఏ ప్రైవేటు ఆస్పత్రిలో అయినా రోగులకు అందించే వైద్యాన్ని అత్యంత రహస్యంగా ఉంచుతున్నారు. కొద్ది చోట్ల మాత్రమే వైద్యం, ఇతర వివరాలను రోగి బంధువులకు చెబుతున్నారు. రోగులకు అందించే మందులు, ఇతర వివరాలను కూడా చెప్పరు. వారు చెప్పే మందులు తెచ్చివ్వడం, బిల్లు చెల్లించడమే బంధువుల పని. రోగికి అందించే వైద్యాన్ని రహస్యంగా ఉంచకూడదన్న నిబంధనలు ఎవరూ పట్టించుకోవడం లేదు. పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులకు చెప్పకుండా బిల్లులు వసూలు చేసుకుంటున్నారు. ఈ తరహా వైద్య సేవలపై నిఘా ఉంచి, చర్యలు తీసుకోవాల్సిన ఆరోగ్యశాఖ తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంతోనే ప్రైవేటు/కార్పొరేట్ ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదు వస్తే తప్ప ఏమీ చేయలేమని ఆరోగ్యశాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రోగులు, వారి బంధువులతో మాట్లాడితే

... మిగతా 6వ పేజీలో

నకిలీ డీలర్లు!

ఇతరుల చేతుల్లో రేషన్ డిపోలు

- శ్రీహరిపురంలో ఒక్కరికే నాలుగు
- తప్పుడు ధ్రువపత్రాల సమర్పణతో కేటాయింపు
- పౌరసరఫరాల శాఖ అధికారుల ప్రమేయంపైనా అనుమానాలు
- నగరంలో చాలా వరకు చేతులు మారిన పరిస్థితి
- సొసైటీల పేరిట దర్జాగా నకిలీ వ్యక్తుల చేతుల్లోకి



విశాఖపట్నం/గాజువాక/ ఆరిలోవ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో అధికశాతం రేషన్‌డిపోలు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు మూడు దశాబ్దాల క్రితం పనిచేసే డీలరు మృతి చెందిన తరువాత పలు కారణాలతో ఆయా డిపోలు ఇతరుల చేతుల్లోకి వెళ్లాయి. ఇంకా డిపోలు నిర్వహించలేని డీలర్లు వాటిని అనధికారికంగా లీజుకు ఇచ్చేశారు. వీటిపై ఆరోపణలను పౌరసరఫరాల శాఖ కొట్టిపారేస్తున్న నేపథ్యంలో గాజువాక సర్కిల్ పరిధి శ్రీహరిపురంలో ఒకే వ్యక్తికి నాలుగు డిపోలు ఉన్నాయన్న ఫిర్యాదు కలకలం రేపుతోంది. దీనిపై జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సమగ్ర విచారణకు ఆదేశించడంతో నకిలీ డీలర్లు, అధికారుల్లో గుబులు మొదలైంది.

పౌరసరఫరాల శాఖ గాజువాక సర్కిల్ పరిధి శ్రీహరిపురంలో ఒక డీలరుకు నాలుగు డిపోలు ఉన్నాయని ఆధారాలతో సహా జేసీకి ఫిర్యాదు అందింది. ఈ ప్రాంతంలో 290 నంబరు గల రేషన్ డిపోను వి.కాంతమ్మ పేరిట గతంలో అధికారులు కేటాయించారు. అనారోగ్యకారణాలతో కాంతమ్మ 2017లో మృతిచెందింది. అయితే ఆ దుకాణాన్ని ఆమె వారసులకు కేటాయించలేదు. తరువాత రెండేళ్లపాటు సమీపంలోని మరో డీలరుకు తాత్కాలికంగా అటాచ్ చేసిన పౌరసరఫరాల శాఖాధికారులు, 2019 మార్చిలో డీలరు అథంటికేషన్ (డీలరుగా రెన్యువల్ చేస్తూ బయోమెట్రిక్ వేయడం) చేసే సమయంలో ఒక డీలరు సతీమణి పేరిట దొంగపత్రాలు సృష్టించడమే కాకుండా డిపో కేటాయించే సమయంలో అథంటికేషన్ రిజిస్టర్‌లో వారి ఫొటో, ఇతర వివరాలు పొందుపరిచారు. ఇదిలావుండగా శ్రీహరిపురం ప్రాంతంలో మృతిచెందిన డీలర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వకుండా, నోటిఫికేషన్ కూడా

... మిగతా 6వ పేజీలో

కిటకిటలాడిన తీరం



ఓవైపు వేసవి తాపం... మరో వైపు ఆదివారం సెలవు దినం కావడంతో నగరవాసులు సేదతీరేందుకు భారీ సంఖ్యలో తీరానికి చేరుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆర్‌కే బీచ్‌కు సందర్శకుల తాకిడి ప్రారంభమయింది. రాత్రి పది గంటల వరకు బీచ్‌రోడ్డు కిక్కిరిసింది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

బైక్ రేసింగ్‌లపై సీపీ దృష్టి

- వారాంతాల్లో ప్రత్యేక నిఘాకు ఆదేశం
- వారంరోజుల్లో పట్టుబడిన 54 మంది రేసర్లు



రేసింగ్ చేస్తూ ఇటీవల పోలీసులకు పట్టుబడిన వాహనాలు



సీపీ శంఖబ్రత బాగ్చీ

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరంలో బైక్‌రేసింగ్‌లకు అడ్డుకట్టవేయడంపై సీపీ శంఖబ్రతబాగ్చి దృష్టిసారించారు. వారాంతాల్లోనే బైక్‌రేసింగ్‌లు ఎక్కువగా జరుగుతుండడంతో ఆయా రోజుల్లో ప్రత్యేక నిఘా పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో గతవారం రోజుల్లోనే 54 మంది రేసర్లు పోలీసులకు పట్టుబడడం పరిస్థితికి అద్దంపడుతోంది.

నగరంలో బైక్‌రేసింగ్‌లు తారస్థాయికి చేరుకున్నాయి. గతంలో నగరశివారు ప్రాంతాల్లో అకస్మాత్తుగా జరిగే రేసింగ్‌లు తాజాగా వారాంతాల్లో సాధారణంగా మారిపోయాయి. పైగా నగర శివారు ప్రాంతాలకు కాకుండా నగరం నడిబొడ్డునే రేసింగ్‌లు నిర్వహిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల నగరంలో రాత్రివేళ పరిస్థితిని పరిశీలించేదుకు సీపీ శంఖబ్రతబాగ్చి అర్ధరాత్రి దాటిన తర్వాత కారులో తిరిగారు. ఆ సమయంలో కొంతమంది యువకులు బీచ్‌రోడ్డు, తెలుగుతల్లి ఫ్లైఓవర్, సిరిపురం తదితర ప్రాంతాల్లో బైక్‌లతో రేసింగ్ నిర్వహించడం గుర్తించారు. దీంతో నగరంలో రేసింగ్‌లకు అడ్డుకట్టవేయాలని అధికారులను ఆదేశించారు. వారాంతాల్లో రేసింగ్‌లు జరుగుతున్నాయని, ఆయా రోజుల్లో నగరమంతా ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు.

రాత్రి గస్తీతో ఫలితాలు

దీంతో నగరంలో పోలీసులు రాత్రివేళ, ప్రధానంగా వారాంతాల్లో గస్తీ పెంచడంతో బైక్ రేసర్లు వరుసగా పట్టుబడుతున్నారు. ఈనెల రెండో తేదీన

... మిగతా 6వ పేజీలో

ఎన్ఆర్ఐ మహిళ మృతి కేసులో పోలీసుల తీరుపై అనుమానాలు

- ఎఫ్ఐఆర్‌లో నిందితులు ఎవరూ లేరని నమోదు

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో చర్చనీయాంశంగా మారిన ఎన్ఆర్ఐ మహిళ ఆత్మహత్య కేసు దర్యాప్తులో పోలీసుల తీరువుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హోటల్ మేఘాలయలోని రూమ్ నంబర్ 229లో ఈనెల ఆరున అమెరికాలో స్థిరపడిన నగరానికి చెందిన 49 ఏళ్ల మహిళ ఆత్మహత్యచేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై రెండు రోజులుపాటు గోప్యత పాటించిన పోలీసులు పత్రికల్లో కథనాలు వచ్చేసరికి శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. అందులో ఆమెది ఆత్మహత్యగా నిర్ధారిస్తూనే, తర్వాత అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొనడం గందరగోళానికి దారితీసింది.

తాజాగా ఈకేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలో నమోదుచేసిన వివరాలు పోలీసుల వ్యవహారశైలిపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం... అమెరికాలో స్థిరపడిన నగరానికి చెందిన వైద్యుడు పి.శ్రీధర్ హోటల్ మేఘాలయలో గోఇబిబో యాప్ ద్వారా రూమ్ బుక్ చేసుకున్నారు. ఈనెల ఆరున మధ్యాహ్నం 1.15 గంటలకు రిసెప్షన్‌కు వచ్చి బుకింగ్ వివరాలను చూపించారు. హోటల్ సిబ్బంది అతని ఐడీ ప్రూఫ్ తీసుకుని రూమ్ నంబర్ 229 కేటాయించారు. అదేరోజు మధ్యాహ్నం 1.40 గంటలకు గుర్తు తెలియని మహిళ హోటల్‌లోకి ప్రవేశించి నేరుగా పి.శ్రీధర్ రూమ్‌కు వెళ్లారు. మధ్యాహ్నం 3.35 గంటలకు పి.శ్రీధర్ రిసెప్షన్ వద్దకు వచ్చి, పొరపాటున తన రూమ్ లాక్ అయిందన్నారు. అంతలోనే బిగ్గరగా ఏడవడంతో హోటల్ మేనేజర్ ఆంటోనీడేవిడ్ ఏమైందని ప్రశ్నించారు. తన స్నేహితురాలు రూమ్‌కు వచ్చి అఘాయిత్యానికి పాల్పడ్డారని, ఆమెకు స్పృహలేకపోవడంతో భయంగా ఉందన్నారు. దీంతో హోటల్ మేనేజర్, శ్రీధర్ హోటల్‌రూమ్‌ను మరో తాళంతో తెరిచి లోపలకు వెళ్లారు. వాష్‌రూమ్‌లో ఆ మహిళ ఉరివేసుకుని ఉండడంతో మేనేజర్ క్రిట్టాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ రమణయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో కాలమ్ నంబరు ఏడులో నిందితులు/అనుమానితులు ఉంటే వారి వివరాలను నమోదు చేయాలి. కానీ పోలీసులు ఆ కాలమ్‌లో నిందితులు ఎవరూ లేరని పేర్కొనడం అనేక అనుమానాలకు దారితీస్తోంది.

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో సంచలనం సృష్టించిన క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడు నానాబల్ల గణేశ్వరరావును ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టైన నిందితుల సంఖ్య 13కి పెరిగింది.

క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు



పెదవాల్తేరులోని డాక్టర్స్‌కాలనీ గాయత్రి టవర్స్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ ఏడాది జనవరి 12న దాడిచేసి లగుడు రవి కుమార్ అనే బుకీని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని విచారించగా లగుడు రవికుమార్‌తోపాటు ఇసుకతోట ప్రాంతానికి చెందిన పల్లా త్రినాథ్, శివాజీపాలేనికి చెందిన బొబ్బిలి రవికుమార్ మరికొందరు కలిసి బుకీల అవతారం ఎత్తి నగరంలో పెద్దఎత్తున బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు తేలింది. దీంతో కేసు దర్యాప్తును సీపీ శంఖబ్రతబాగ్చి సైబర్‌క్రైమ్ పోలీసులకు అప్పగించారు. వారు దర్యాప్తు ప్రారంభించి బుకీలు సుమారు 137 బ్యాంకు ఖాతాల నుంచి రూ.400 కోట్ల లావాదేవీలు చేసినట్టు గుర్తించారు. ఆయా ఖాతాల్లో ఉన్న రూ.45 లక్షలను ఫ్రీజ్ చేశారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న బుకీలతో పాటు వారికి బ్యాంక్ ఖాతాలను సరఫరా చేశారనే అభియోగంపై దశల వారీగా 12 మందిని అరెస్టు చేశారు.

ఈ కేసులో ప్రధాన నిందితుడు అల్లిపురం సమీపంలోని అచ్చియ్యమ్మపేట తాడివీధికి చెందిన నానాబల్ల గణేశ్వరరావు, ఇసుకతోటకు చెందిన పల్లా త్రినాథ్, శివాజీపాలేనికి చెందిన బొబ్బిలి రవికుమార్ పరారీలో ఉండడంతో పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. పల్లా త్రినాథ్‌తో, బొబ్బిలి రవికుమార్ ముందస్తు బెయిల్ తెచ్చుకోగా, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఆదివారం గణేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.08
సహరి (మంగళ)	4.51

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే గంటా భరోసా



ఎమ్మెల్యే గంటాను కలిసిన నర్సింగరావు కుటుంబ సభ్యులు

భీమునిపట్నం (రూరల్‌) మార్చి 09 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం బోడమిట్టపలెంవద్ద కారు ప్రమాదానికి గురై మృతి చెందినపిట్ట నర్సింగరావు కుటుంబ సభ్యులు ఆదివారం విశాఖలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి తమను ఆదుకోవాలని కోరారు. డిసెంబరు 9న పెయింటింగ్‌ పనులకు వెళుతూ ప్రమాదానికి గరవడంతో నర్సింగరావు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. అతని సంపాదనపైనే భార్య, ఇద్దరు పిల్లలు ఆధారపడి ఉన్నాడని, ఇప్పుడుఆ కుటుంబానికి దిక్కు లేకుండా పోయిందని, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ కార్యకర్తగా ఉన్నారని, నర్సింగరావు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. టీడీపీ కార్యదర్శి పిట్ట సురేశ్‌, పి.సూరిబాబు ఎం.వరలక్ష్మి, రామారావు, కొప్పల కృష్ణ ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు నేతలు తెలిపారు.

15న నూకాలమ్మ ఉత్సవం

భీమునిపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): భీమిలి గ్రామదేవత శ్రీ నూకాలమ్మ వారి దేవర చాటింపు ఉత్సవం ఈనెల 15న ఘనంగా నిర్వహిసున్నట్టు ఉత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు తెలిపారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకూ అమ్మవారి ఉత్సవాలు జరుగనున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆలయ పూజారి చౌదరి సత్యరాజ్‌ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి ఈ చాటింపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

18న విశాఖ పీఎఫ్‌ కమిషనర్‌ కార్యాలయం ఎదుట ధర్నా

కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ జూట్‌ మిల్లు పెన్షనర్ల సమావేశం తీర్మానం

తగరపువలస, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : జూట్‌మిల్లు, ఇతర కార్మికుల పించన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 18న విశాఖ ప్రావిడెంట్‌ ఫండ్‌ కమిషనర్‌ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టాలని పెన్షనర్ల సంఘ సమావేశం తీర్మానించింది. ఆదివారం తగరపువలస జీఆర్‌ భవన్‌లో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కానూరి రాంబాబు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్మాగారాల్లో పని చేసిన కార్మికులకు కనీస పించను రూ.16 వేలుగా నిర్ణయించాలని డిమాండ్‌ చేశారు. పింఛనుదారులకు బస్సులు, రైళ్లల్లో రాయితీ సదుపాయం, ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని కొంతకాలంగా కోరుతున్నామన్నారు. ఇటీవల కేంద్ర కార్మికమంత్రి పింఛనుదారుల సమస్యల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారని, కానీ బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



పెన్షనర్ల సమావేశంలో పాల్గొన్న సంఘ నేతలు

దీనిపై నిరసన కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఈనెల 13న చిట్టివలస లేబర్‌ వెల్ఫేర్‌ సెంటర్‌లో మరోసారి సమావేశం నిర్వహించి అందరు పింఛనుదారులకు విషయాలను తెలియజేసి సమాయత్తం చేయాలని, ఈ నెల 18న విశాఖ పీఎఫ్‌ కార్యాలయం ఎదుట నిరసన, ధర్నా చేపట్టాలని తీర్మానించినట్టు వెల్లడించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ, సహ కార్యదర్శి మోర అప్పలరాజు, ఉపాధ్యక్షులు అప్పారావు కోశాధికారి వి.సూర్యనారాయణ తదితరులు మాట్లాడారు.

నేడు ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన

కొమ్మాది, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కొమ్మాది జంక్షన్‌ సమీపంలోనిమకన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం 9.21 నిమిషాలకు వేంకటేశ్వరస్వామి, పంచముఖేశ్వరస్వామి, వారాహి అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించనున్నట్టు శ్రీవాసవీకన్యాకపరమేశ్వరి ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర విద్యాసంస్థల అధినేత వేంకటేశ్వరావు మాట్లాడుతూ కన్యాకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆలయ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించామని, అందుకు అనుగుణంగా బ్రహ్మశ్రీ వేమకోటి సూర్యనారాయణ శర్మ పర్యవేక్షణలో శంకుస్థాపన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమానికి విశాఖపట్నం నగరంలోని పలువురు రాజకీయనాయకులతో పాటు పలువరు ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. శంఖుస్థాపన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పొట్టా జగదీష్‌, కె.లక్ష్మీనారాయణ, ఎస్‌.బాబూరావు, జి.రమాకామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతినిధులు

ఘనంగా వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

భీమునిపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): భీమిలి కృష్ణాకాలనీ వేంకటగిరిపై వెలసిన శ్రీ పద్మావతి, గోదా సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ఘనంగా త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం శ్రీ విష్వక్సేన ఆరాధనతో ఈ ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం, ఆలయ ప్రధానార్చకులు అప్పలాచార్యులు, రుత్విక్‌ల పర్యవేక్షణలో రక్షాసూత్ర బంధనం, పరిషత్‌ రుత్విక్‌ వరుణం, మృత్సం గ్రహణం, యాగశాల ప్రవేశం, అగ్ని మదనం, అగ్ని ప్రతిష్ఠాపన, అంకురార్ప. మంగళాశాసనం చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదగోష్ఠి చేశారు. ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, చిన్నికుమారి దంపతులు,గౌరవాధ్యక్షులు రేలంగి పెదబాబు, ముమ్మిడిశెట్టి సత్యానందరావు, గాడు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ మంజూరు పత్రాల అందజేత



సీఎంఆర్‌ఎఫ్‌ మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్‌

భీమునిపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ఏడుగురికి మంజూరైన రూ. 15.91లక్షలకు సంబంధించిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్‌) పత్రాలను సంబంధిత వ్యక్తులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేశారు. ఆదివారం నగరంలోని ఎంవీపీ కాలనీలో తన కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా పంపిణీ చేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న జీవీఎంసీ 8వ వార్డుకు చెందిన గెడ్డం ప్రణీత్‌కు రూ. 5.36 లక్షలు, జక్కంపూడి రేణుక తనయుడికి రూ.5 లక్షలు, తగరపువలసకు చెందిన మాదాబత్తుల ఉమా కృష్ణవేణికి రూ.2లక్షలు, మీసాల ప్రసాద్‌కు రూ.40 వేలు, ఆనందపురం గ్రామానికి చెందిన శెట్టి ఎర్రినాయుడుకు రూ. 1.65 లక్షలు, ఆనందపురం మండలం చందక గ్రామానికి చెందిన లొడగల జాస్మిన్‌ విజయ్‌ యాదవ్‌కు రూ.లక్ష, జీవీఎంసీ 5వ వార్డుకు చెందిన శరగడం నిహారికకు రూ. 44 వేల రూపాయిలకు సంబంధించినమంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాస్‌ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ ఆందరి మన్ననలు పొందుతామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొప్పల రమేష్‌, చెట్టుపల్లి గోపి, చిన్న గోపి, శతపతి మంగాదేవి, మొల్లి లక్ష్మణ రావు, నాగోతి సత్యనారాయణ, తమ్మిన సూరి బాబు, పిట్టా సురేష్‌, పాండ్రంగి అప్పలరాజు, అంగటి రాము, ఎస్‌.రామారావు, మీసాల సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతుల ప్రదానం

భీమునిపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలో వున్న మహిళా ప్రజాప్రతినిధులు, పార్టీ మహిళా నాయకులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి గంటా శారదమ్మ, తనయుడు గంటా రవితేజలు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా, శని, ఆదివారాల్లో వారి ప్రతినిధులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తరఫున మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ, ఉమెన్స్‌ డే కేక్‌, క్యాలెండర్‌, డైరీని అందించారు. భీమిలిలో తూర్పు కాపు కార్పొరేషన్‌ రాష్ట్ర డైరెక్టర్‌ కురిమిన లీలావతి, జీవీఎంసీ కార్పోరేటర్లు గాడు చిన్నికుమారిలక్ష్మి, గంటా అప్పలకొండ, పద్మనాభం ఎంపీటీసీ లక్ష్మి, మాజీ జడ్పీటీసీ బమ్మిడి ఉమ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బోయి రమాదేవి, జిల్లా మహిళా కమిటీ సభ్యురాలు శతపతి మంగాదేవి, 3వ వార్డు సీనియర్‌ నాయకరాలు ఎల్లయ్యమ్మ లకు ఆయా బహుమతులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



కార్పొరేటర్‌ గంటా అప్పలకొండకు బహుమతిని అందిస్తున్న దృశ్యం

ఘనంగా దుర్గాంబికా, పైడిమాంబ ఉత్సవాలు ప్రారంభం

కొమ్మాది, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది సాయిరాంకాలనీ శ్రీదుర్గాంబికా జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం చాటింపు సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం నారికేళ, జల, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఉత్సవాల్లో బాగంగా మొదటి రోజు బాలబాలికలకు ఆటల, పోటీలు నిర్వహించారు. సాయంకాలం దీపారాధన నిర్వహించి అమ్మవారికి పెరంటాళ్లతో పుట్టబంగారం తీసుకొచ్చారు. కార్యక్రమంలో గ్రామకమిటీ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసనాయడు, అధ్యక్షుడు కురుమోజు గోవిందరావు, ఉపాధ్యక్షులు వైయస్‌ మూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే కొమ్మాది, పీఎం పాలెం ఆర్‌హెచ్‌ కాలనీలో పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తోలేళ్ల పండగ ఘనంగా నిర్వహించారు.తొలిపూజలో పిళ్లారాము, కర్రి రామారావు, అమ్మవారికి గజమాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోక్సో చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలి

ఒకటో అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్‌ సౌజన్య

భీమునిపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : లైంగిక వేధింపుల నుంచి బాలికలకు రక్షణ కల్పించే పోక్సో చట్టంపై విద్యార్థినులు అవగాహన పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని భీమిలి ఒకటో అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్‌ డి.సౌజన్య పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బీచ్‌రోడ్‌లో ఉన్న సమీకృత బాలికల వసతిగృహంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన వేదిక నిర్వహించి, విద్యార్థినులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అకృత్యాలను వివరిస్తూ, ఆయా సంఘటనలకు పోక్సో చట్టంలో ఏయే సెక్షన్లు వర్తిస్తాయో వివరించారు. విద్యార్థినులు బాగా చదువుకోవాలని, ధైర్యంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకుని ముందుకు నడవాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. భీమిలి పోలీసుస్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ బి.సుధాకర్‌ మాట్లాడుతూ ఆడపిల్లల స్వేచ్ఛను హరించేలా వేధింపులకు పాల్పడుతున్న వారికి భయపడవద్దని, ధైర్యంగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా వెంటనే మీ రక్షణకు పోలీసులు సిద్ధంగా ఉంటారన్నారు. భీమిలి కోర్టు బార్‌ అసోషియేషన్‌ అధ్యక్షుడు ఎంవీ పార్వతీశం మాట్లాడుతూ ఇటువంటి దురాగతాలన్నీ సన్నిహితంగా ఉన్న వారి నుంచే ఎక్కువగా ఎదురవుతుంటాయని, అవతలి వ్యక్తి ఎంతటి సన్నిహితులైన వారిలో దుర్బుద్ధి గుర్తించిన వెంటనే జాగ్రత్త పడాలని సూచించారు. పోక్సో చట్టం రక్షణగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు డి.కనకమహాలక్ష్మి, సీహెచ్‌.రాజశేఖర్‌, ఎస్‌.సురేష్‌రెడ్డి, వసతి గృహ సంక్షేమాధికారులు కె.సుజాత, వి.అరుణ, ఎస్‌.భారతి ,సమీకృత బాలికల వసతిగృహం, ప్రభుత్వ బీసీ, సాంఘిక సంక్షేమ కాలేజీ గర్ల్స్‌ సుమారు 300 మంది పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన వేదిక సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్‌ సౌజన్య

రుషికొండ బీచ్‌కు పూర్వవైభవం తెస్తాం: ఎమ్మెల్యే గంటా

సాగర్‌నగర్‌, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్‌లో ప్రతిష్ఠాత్మకమైన బ్లూఫ్లాగ్‌ ఎగురవేస్తామని, పూర్వవైభవం తెస్తామని భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం రుషికొండ బీచ్‌లో జరుగుతున్న బ్లూఫ్లాగ్‌ సర్టిఫికేషన్‌ పనులను పరిశీలించి షాపుల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. వ్యాపారుల ఆక్రమిత ప్రాంతాన్ని చూసి టూరిజం అధికారులకు పలు సూచనలు చేశారు. బ్లూఫ్లాగ్‌ ట్యాగ్‌ ఉంటే అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించవచ్చని మీడియాతో అన్నారు. బీచ్‌ నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్‌ ఆపరేటర్‌కు అప్పగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 14న డెన్మార్క్‌కు చెందిన బ్లూఫ్లాగ్‌ టీమ్‌ వస్తోందన్నారు. అందరినీ సమన్వయ పరిచి ముందుకు సాగుతామన్నారు. కార్పొరేటర్‌ లొడగల అప్పారావు, జోనల్‌ కమిషనర్‌ కనకమహాలక్ష్మి, టూరిజం ఆర్‌డీ జగదీష్‌, అసిస్టెంట్‌ మేనేజర్‌ బసంత్‌, ఈఈ రమణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో రూ 2 కోట్లతో చేపట్టనున్న అభివృ పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సాగర్‌నగర్‌లో ఆదివారం శంకుస్థాపన చేశారు. సాగర్‌నగర్‌, సిరుగుడినగర్‌, వివేకానందనగర్‌, తారకరామనగర్‌ లేఅవుట్‌, హెచ్‌బికాలనీ, పాతమధురవాడలలో తారురోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి ఈ నిధులు ఖర్చుచేస్తారని తెలిపారు. ఇటీవల జరిగిన బాస్కెట్‌బాల్‌ పోటీల్లో పతకాలు గెలుచుకున్న సాగర్‌నగర్‌ క్రీడాకారులను అభినందించారు. జోనల్‌ కమిషనర్‌ కనకమహాలక్ష్మి,ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ శాంతిరాజు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చిత్రంలో స్థానిక నాయకులు, అధికారులు

బాధిత కుటుంబానికి సీఎం సహాయం

ఆనందపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆనందపురంలోని చెట్టి ఎర్రినాయుడు కుటుంబానికి మంజూరైన రూ. 1,65,575ల సీఎం సహాయ నిధి చెక్కును శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు. అతడు చెట్టు కొడుతుండగా ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. పేద కుటుంబం ఆర్థిక ఇబ్బందులను గంటా దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చొరవతో ఈ సహాయం అందింది.

గీతంలో 12 నుంచి యూత్‌ పార్లమెంట్‌ ఫెస్టివల్‌

సాగర్‌నగర్‌, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి యువనాయకులను తయారుచేసే లక్ష్యంతో వికసిత్‌ భారత్‌-2047 కార్యక్రమంలో భాగంగా గీతం డీమ్డ్‌ యూనివర్సిటీలో ఈ నెల 12నుంచి నేషనల్‌ యూత్‌ పార్లమెంట్‌ ఫెస్టివల్‌ 2025ను నిర్వహించనున్నట్లు కార్యక్రమ సభ్య కార్యదర్శి మహేశ్వరరావు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో పార్లమెంట్‌ విధానాలపై అవగాహన పెంచి, జాతీయ నిర్మాణంలో చురుగ్గా పాల్గొనేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్‌ ఎస్‌.వి.జి. రెడ్డి ప్రోగ్రామ్‌ కో-ఆర్డినేటర్‌గా, షేక్‌ షంషుద్దీన్‌ ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు.

మాదక ద్రవ్యాల సేవనానికి వచ్చిన ముగ్గురు యువకుల అరెస్టు

మహారాణిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌ వెనుక నిర్మానుష్య ప్రాంతంలో మాదక ద్రవ్యాలు సేవించేందుకు వచ్చిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు మహారాణిపేట పోలీసులు తెలిపారు, ఆదివారం సాయంత్రం అందిన పక్కా సమాచారంతో పోలీసులు ముందుగా మాటువేశారు. కొమ్మాది ప్రాంతానికి చెందిన పిఠాపురపు మనోజ్‌ (20), నమ్మి అభి (20), మహారాణిపేట వాసి అడపా గణేషులు అక్కడికి వచ్చి పోలీసులను చూసి పారిపోబోయారు. వీరిని పట్టుకుని పరిశీలించగా ఎమ్‌డిఎమ్‌ఏ డ్రగ్‌, గంజాయి లభ్యమైంది. గోవా వెళ్లి ఎమ్‌డిఎమ్‌ఈ డ్రగ్‌ కొని తీసుకొచ్చి ముగ్గురం జిల్లా పరిషత్‌ వెనుక తుప్పలలో కలిసి సేవించేవారిమని మనోజ్‌ పోలీసులకు తెలిపాడు. వీరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన



స్వర్ణ పుష్పాలతో స్వామివారికి అర్చన చేస్తున్న దృశ్యం

సింహాచలం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారికి ఆదివారం 108 బంగారు సంపెంగలతో శాస్త్రోక్తంగా పుష్పార్చన చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజు స్వామివారిని అలంకరించి ఆలయ కల్యాణ మండపంలో మంగళవాయిద్యాల నడుమ స్వర్ణపుష్పార్చన సేవ నిర్వహించారు.

పంచకర్లను మర్యాద పూర్వకంగా కలిసిన సింహాచలం ఈవో



ఎమ్మెల్యే పంచకర్లను సన్మానిస్తున్న దృశ్యం

సింహాచలం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఈవో గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.సుబ్బారావు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును సుజాతనగర్‌ క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. దేవస్థానంలో చేపడుతున్న కార్యక్రమాలపై పంచకర్లతో ఈవో చర్చించారు. అనంతరం పంచకర్లకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.

సామూహిక ఉపనయనాలు

సింహాచలం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక ఉపనయన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 216 మందికి సామూహిక ఉపనయన ధారణ కార్యక్రమం చేపట్టారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఏటా సింహాద్రి అప్పన్న పాదాల చెంత సామూహిక ఉపనయన కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామని, గత ఏడాది 108 మందికి చేసినట్లు తెలిపారు. జిల్లా కళింగ వైశ్య సేవా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కళింగ వైశ్య యువకులు

ఇసుక అక్రమంగా తరలిస్తున్న పది లారీల పట్టివేత

ఆనందపురం మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నకిలీ వే బిల్లులు, ఓవర్‌ లోడ్‌తో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం ఉదయం క్వారీ లారీ యజమానుల సంఘం ప్రతినిధుల సమాచారంతో 10 ఇసుక లారీలను వేములవలస పెట్రోల్‌ బంక్‌ పమీపంలో స్థానిక పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. లారీ యజమానుల సంఘం ప్రతినిధులు పోలీస్‌స్టేషన్‌ వద్దకు చేరుకోవడంతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ యజమానులతో వాగ్వాదం చోటు చేసుకుంది. సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిల వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుక విధానం తీసుకొచ్చాక కొందరు నకిలీ వే బిల్లులతో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా విజయవాడ, గుంటూరు, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి పలుకుబడి ఉపయోగించి ఈ వ్యవహారం సాగిస్తున్నారని ఆరోపించారు. అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారని విమర్శించారు. అందరికీ సమన్యాయం చేయాలని కోరారు. సంఘం ప్రతినిధులు బొట్ట.సురేష్‌, సురేష్‌కుమార్‌, కొయ్య శ్రీను, మద్దిల శ్రీనివాసరావు, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. బిల్లులు పరిశీలించి గనులు, రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆనందపురం సీఐ వాసునాయుడు చెప్పారు.



ఆనందపురం పోలీసుల స్వాధీనంలో ఇసుక లారీలు



పోలీసు స్టేషన్‌ వద్ద అక్రమార్కులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న స్థానిక లారీ యజమానుల సంఘం ప్రతినిధులు

కార్పొరేట్‌ ఆస్పత్రుల దోపిడీ

... 5వ పేజీ తరువాయి

ఇలాంటి వ్యవహారాలు వెలుగులోకి వస్తాయి. కానీ ఆ దిశగా ఎలాంటి చర్యలు లేవు.

చివరి దశలో కేజీహెచ్‌కు..

కేజీహెచ్‌లో ప్రతిరోజూ చికిత్స పొందుతూ మృతి చెందే రోగుల్లో దాదాపు 80 శాతం కేసులు ప్రైవేటు/ కార్పొరేట్‌ ఆస్పత్రుల నుంచి వచ్చినవేనని అధికారులు చెబుతున్నారు. అప్పటికే చేయి దాటిపోవడంతో తామేమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతోందని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కేజీహెచ్‌లో మృతుల సంఖ్య అధికంగా కనిపిస్తోందని, దానికి ఇదే ప్రధాన కారణమంటున్నారు.

బైక్‌రేసింగ్‌లపై సీపీ దృష్టి

... 5వ పేజీ తరువాయి

రాత్రి సమయంలో మానసిక ఆస్పత్రిరోడ్డులో బైక్‌రేసింగ్‌లకు పాల్పడుతున్నట్టు పోలీసులు గుర్తించి 38 మంది రేసర్లను అదుపులోకి తీసుకోవడంతో పాటు 38 ద్విచక్రవాహనాలను స్వాధీనం తీసుకున్నారు. అలాగే ఈనెల ఏడో తేదీన సిరిపురం కూడలి పరిసరాల్లో రేసింగ్‌ నిర్వహిస్తున్న మరో 18 మంది పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి బైక్‌లను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదుచేశారు. పట్టుబడిన యువకుల తల్లిదండ్రులను పిలిపించి, కౌన్సెలింగ్‌ నిర్వహించారు. ఇలాంటి రేసింగ్‌లు నగరంలో బీచ్‌రోడ్డుతోపాటు బీఆర్‌టీఎస్‌రోడ్డు, మారికవలస నుంచి ఐటీ హిల్స్‌కు వెళ్లేరోడ్డు, రుషికొండ, తిమ్మాపురం బీచ్‌రోడ్డులో ఎప్పటికప్పుడు జరుగుతుంటాయని పోలీసులే చెబుతున్నారు.

వాట్సాప్‌ గ్రూపుల్లో సమాచారం

రేసింగ్‌కు పాల్పడేవారంతా వాట్సాప్‌, ఇన్‌స్టాల్లో గ్రూపులుగా ఏర్పడి రేసింగ్‌ ఎక్కడ నిర్వహించేదీ సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నారు. ఒక్కొక్కరుగా అక్కడికి చేరుకుని పోలీసుల రాకను గమనించి జిగ్‌జాగ్‌లు, స్పీడ్‌ డ్రైవింగ్‌, స్టంట్‌లు వంటి వాటిపై పోటీలు పెట్టుకుంటున్నారు. ఆ సమయంలో అదే రోడ్డుపై వెళ్లే వాహనచోదకులు వారిని చూసి ఆందోళనకు గురై ప్రమాదాల బారిన పడిన సందర్భాలు కూడా ఉన్నాయని పోలీసులే చెబుతున్నారు. యువత ప్రాణాలను బలిగొంటున్న రేసింగ్‌లపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని నగరవాసులు కోరుతున్నారు.

నకిలీ డీలర్లు!

... 5వ పేజీ తరువాయి

జారీ చేయకుండా ఒకే వ్యక్తికి నాలుగు దుకాణాలు కేటాయించారు. ఇలాంటి సందర్భాలలో ఒరిజినల్‌ డీలరు వేలిముద్రలు తొలగించి నకిలీ వ్యక్తి వేలిముద్ర వేయిస్తున్నారు. శ్రీహరిపురం ప్రాంతంలో డిపో నంబరు 286పై విజిలెన్స్‌ అధికారులు దాడి చేసిన తరువాత ఆ డిపోను తాత్కాలికంగా మరొకరికి అప్పగించారు.

వెలుగులోకి రానివి ఎన్నో...

నగరంలో చాలా రేషన్‌ డిపోలు ఒరిజినల్‌ డీలర్లకు బదులు నకిలీ వ్యక్తులు నిర్వహిస్తున్నారు. విచిత్రమేమిటంటే ఒరిజినల్‌ డీలరుతో సంబంధంలేకుండా వారి వేలిముద్రలతో డూప్లికేట్‌ వేలిముద్రలు తయారుచేసి ప్రతి నెలా సరకులు విడుదల చేస్తున్నారు. ఈ లెక్కన కొందరు వ్యక్తులు రెండు అంత కంటే ఎక్కువ డిపోలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం పౌరసరఫరాల శాఖలో అందరికీ తెలుసు. ప్రధానంగా చెకింగ్‌ ఇన్‌స్పెక్టర్లు, గోదాముల వద్ద సరుకు విడుదలచేసే ఇన్‌చార్జి, ఇతర ఉద్యోగులకు నెలవారీ మామ్మూళ్లు అందుతాయి. రెండువారాల క్రితం కురుపాం మార్కెట్‌ ఏరియాలో బియ్యం అమ్మకాల్లో గొడవ సందర్భంగా ఒక డీలరుపై ఇద్దరు బినామీ డీలర్లు దాడిచేశారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టలేదు. కాగా ఏళ్ల కిందట సొసైటీల పేరిట రేషన్‌ డిపోలు తీసుకున్న కార్యవర్గాలు ఇప్పుడు మనుగడలో లేవు. అయినా పౌరసరఫరాల శాఖలో కొందరి ప్రమేయంతో ఆయా డిపోలను కొందరు సొసైటీ సభ్యుల పేరుతో నిర్వహిస్తున్నారు. కాగా ప్రతి రెండేళ్లకు ఒకసారి మార్చిలో రేషన్‌ డిపోలుఅథంటికేషన్‌ (డిపో రెన్యువల్‌) చేస్తారు.

పౌరసరఫరాల శాఖలో ఉన్న అథంటికేషన్‌ రిజిస్టర్‌లో ఉన్న వివరాలు, గతంలో నోటిఫికేషన్‌ ద్వారా డీలర్లుగా ఎంపికైన వారి వివరాలతో రెన్యువల్‌కు వచ్చే వారి వివరాలను సరిపోల్చి వేలిముద్రలు తీసుకుంటే బినామీ/ నకిలీలకు చెక్‌ పడుతుందని పలువురు డీలర్లే పేర్కొంటున్నారు.

మే 11 నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు

- మూడు రోజుల పాటు నిర్వహణ
- ఆలయ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వెల్లడి



పాడేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మోదకొండమ్మ ఉత్సవాలను ఈ ఏడాది మే నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం మోదకొండమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆలయ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ప్రకటించారు. ప్రతి ఏడాది మే నెలలో మోదకొండమ్మ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. అందుకు గాను ఆదివారం ఆలయ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ప్రధాన కార్యదర్శి కిల్లు కోటినాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నేతలు, గ్రామపెద్దలు, వర్తక సంఘం నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు ప్రధానార్చకుడు సుబ్రహ్మణ్యం ముహూర్తం పెట్టారు. దీంతో మే నెల 11, 12, 13 తేదీల్లో ఉత్సవాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ ఛైర్మన్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటినాయుడు, టూరిజం డైరెక్టర్ కేవీ రమేశ్‌నాయుడు, ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రాజకీయ నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న యామిని అరంగేట్రం నృత్య ప్రదర్శన



మద్దిలపాలెం, మార్చి9 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో యామిని కూచిపూడి అరంగేట్రం అందరిని ఆకట్టుకుంది. సిద్దేంద్ర యోగి కళానియం గురు ఎస్ఎస్ వి సత్యభామ వద్ద పదిహేనేళ్లు కూచిపూడి నాట్యం అభ్యసించిన శ్రీమతి యామిని ప్రదర్శించిన నృత్యాలు అదరహో అనిపించాయి.

సినిమా గైడ్

- **ఛావా:** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ(గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 14, వంకాయలు (తెలుపు)24, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 44, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 40, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 40, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)50, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 28, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామ కాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170

పొదుపు రుణం.. మహిళా వ్యాపారులకు వరం

- పీఎం స్వానిధి పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు రుణాలు
- రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణం పొందే అవకాశం
- జోన్-3లో 2700 మందికి మంజూరు



మద్దిలపాలెం, మార్చి9 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థిక పురోగతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. అతివలు చేపట్టే వ్యాపారాలకు రుణాలు మంజూరు చేసి ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నాయి. గ్రామీణ ప్రాంత మహిళలకే కాదు. పట్టణ ప్రాంత మహిళలకు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ముఖ్యంగా పీఎం స్వానిధి మహిళల భవితకు వరంలా మారింది. పీఎం స్వానిధి అంటే.. ప్రధానమంత్రి వీధి వ్యాపారుల అభివృద్ధి నిధి పథకం. ఈ పథకం ద్వారా పొదుపు సంఘాల మహిళలకు రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు అందిస్తున్నారు.

కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న పీఎంస్వానిధి ద్వారా నగరంలో ఎందరో మహిళలు రుణాలు పొంది తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. జీవీఎంసీ జోన్-3 పరిధిలో 3 వేల మంది మహిళలు పీఎంస్వానిధి పథకానికి దరఖాస్తు చేయగా 2700మందికి రుణాలు మంజూరయ్యాయి. జోన్-3 పరిధిలో సుమారు 32 వేలమంది డ్వాక్రా మహిళలున్నారు. వారిలో ఆరువేల మంది వరకు చిన్న, సూక్ష్మ, మధ్య తరహా వ్యాపారాలు చేస్తున్నారు. వ్యాపారాలు నిర్వహించే మహిళలందరూ పీఎం స్వానిధి పథకానికి దరఖాస్తు చేసుకుని రుణాలు పొందవచ్చు.

9 శాతం వడ్డీతో...

వ్యాపారాలు చేసుకునే డ్వాక్రా మహిళలు ఈ రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ముందుగా రూ.పది వేలు రుణం అందిస్తారు. తీసుకున్న రుణం సక్రమంగా చెల్లిస్తే రుణ మొత్తం పెంచుకుంటూ రూ.10లక్షల వరకు మంజూరు చేస్తారు. 9 శాతం వడ్డీతో ఈ రుణాలు అందిస్తున్నారు. తిరిగి చెల్లింపులకు 18 నెలల నుంచి 36 నెలల సమయం తీసుకోవచ్చు. ఈఎంఐ మొత్తం డిజిటల్ రూపంలో చెల్లిస్తే ఏడాదికి రూ.1200 వరకు క్యాష్ బ్యాక్ ఆఫర్లు కూడా అందిస్తున్నారు. అంతేకాకుండా డావడ్డీలో కూడా రాయితీలు కల్పిస్తున్నారు.

ఇవీ అర్హతలు..

డ్వాక్రా సంఘాల్లో సభ్యులైన 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలు మాత్రమే పీఎం స్వానిధి పథకానికి అర్హులు. అంతేకాకుండా అర్బన్ లోకల్ బాడీస్(యూఎల్‌బీ) వెండింగ్ సర్టిఫికెట్ కలిగిన వీధి విక్రేతలు, వ్యాపారాలు చేస్తున్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. జీవీఎంసీ అధికారులు జారీ చేసిన వెండింగ్ సర్టిఫికెట్ కలిగి వుండాలి. ఒకవేళ వెండింగ్ సర్టిఫికేట్ లేకపోతే యూఎల్‌బీల వద్ద తాత్కాలిక వెండింగ్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ అయి వుండాలి. ఆయా పత్రాలతో పీఎం స్వానిధి పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు లేదా మెప్మా కార్యాలయాల్లో దరఖాస్తు చేసి రుణాలు పొందవచ్చు.

నర్సింగ్ సిబ్బంది సేవలు అమూల్యం

- హోంమంత్రి వంగలపూడి అనిత కితాబు



కేజీహెచ్‌లో హోంమంత్రి అనితను సత్కరిస్తున్న నర్సింగ్ సిబ్బంది

మహారాణిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మహిళలు ఎప్పుడూ మహారాణులుగానే నిలుస్తున్నారని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం కేజీహెచ్‌లోని ఆంధ్ర వైద్య కళాశాల సమావేశ ప్రాంగణంలో ప్రభుత్వ నర్సింగ్ సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హోం మంత్రి అనిత తొలుత కేకు కోశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఆసుపత్రికి వచ్చిన రోగులను కంటికి రెప్పలా చూసుకునే మహోన్నత వ్యక్తులు నర్సింగ్ సిబ్బంది అని ప్రశంసించారు. దేశ జనాభాలో మహిళలే ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వాలు వీరికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని హితవు పలికారు. మహిళల రక్షణకు ప్రభుత్వం శక్తి యాప్‌ను ప్రవేశపెట్టిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవి లతా, ఆర్ఎంవో మోహార్‌కుమార్, నర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు టి.గంగాభవానీ, కార్యదర్శి వరలక్ష్మి, టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, సౌత్ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు, నాయకులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన క్రీడాకారులు

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తాం

జాతీయ అథ్లెట్స్ అభినందన సభలో 'వావ్' చీఫ్ ప్యాట్రన్ కమల్ బయిద్

ఎంవీపీ కాలనీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను చాటిన విశాఖ అథ్లెట్స్ అంతర్జాతీయ క్రీడా వేదిక మలేషియాలో తమ సత్తా చాటి భారతదేశ పతాకాన్ని ఎగురవేసి విశాఖ కీర్తి ప్రతిష్ఠలను నలుమూలలా వ్యాపింపచేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ ఇంద్ర డోనర్, వావ్ చీఫ్ ప్యాట్రన్ కమల్ బయిద్ పిలుపునిచ్చారు. క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఎంవీపీ కాలనీ ఎనిమిదో సెక్టరు నందూరి వారింటి వద్ద ఏర్పాటుచేసిన జాతీయ అథ్లెట్స్‌కు అభినందన, సన్మాన సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల రాజస్థాన్‌లోని అళ్వార్‌లో నిర్వహించిన 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం నుంచి 33 మంది జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొని తమ ప్రతిభను చాటి 13 స్వర్ణం, 16 రజత, 14 కాంస్య పతకాలను సాధించి, నగరానికి వచ్చిన క్రీడాకారులను అభినందించారు. వారికి ధ్రువపత్రాలు, జ్ఞాపికలను అందించారు. వావ్ కన్వీనర్ నందూరి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ సెక్రటరీ జనరల్, వావ్ అధ్యక్షుడు మంగ వరప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితునిగా జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సీహెచ్ శ్రీనివాసరాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, ఛైర్ పర్సన్ వంశీ చింతలపాటి, 'వావ్' కార్యదర్శి ఎల్వీ సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగంలో మహిళలు రాణించాలి

- బీచ్‌రోడ్డులో నిర్వహించిన రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువత



రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువతులు

బీచ్ రోడ్డు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఫిట్‌నెస్ కేవలం క్రీడలకే కాదని, మన జీవితాల్లో కీలక భాగమని ఫ్లూయెంట్ గ్రిడ్ సంస్థ హెచ్‌ఆర్ హెడ్ సుకుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం ఆర్కే బీచ్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు విద్య, నైపుణ్యాలపై దృష్టి సారించడం వల్ల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. మహిళలకు అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ధీటుగా ఎదుర్కొనేలా మానసిక, శారీరక దృఢత్వం అవసరమన్నారు. క్రీడల్లో ఫిట్‌నెస్ అంతర్భాగమని, అందుకే ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో శారీరక కదలికలను ప్రోత్సహించడంతో పాటు యువతలో క్రీడాభిలాషను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ముఖ్యమన్నారు. ప్రధాని మోదీ ఇటీవల మన్ కీ బాత్ ప్రసంగంలోని ఫిట్ ఇండియా మూవ్‌మెంట్‌లో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ కూడలి వరకు రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్లూయెంట్ గ్రిడ్ సంస్థ ప్రతినిధులు, మాధురి, ఎవీపీ లీగల్, బ్రెరీ అల్లాయ్స్ ప్రేరణ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతుల ప్రదానం

మాధవధారలో దంత వైద్య శిబిరం



దంత పరీక్షలు చేస్తున్న వైద్యనిపుణులు

మాధవధార, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 50వ వార్డు మాధవధారలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. మాధవ యువజన సమాజం ప్రాంగణంలో జరిగిన ఈ శిబిరంలో అనిల్ నీరుకొండ దంత వైద్యులు సేవలందించారు. సమాజం అధ్యక్షుడు రాంగోపాల్ మాట్లాడుతూ స్థానిక వైద్యులు బి.యుక్తాముఖి నిర్వహణ బాధ్యతలు చేపట్టి శిబిరాన్ని విజయవంతం చేశారని అన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య సేవల్ని వినియోగించుకున్నారు. వైద్యులు ప్రహర్ష, వినీల, వసుంధర తదితరులు హాజరయ్యారు. స్థానిక కార్పొరేటర్ వి.ప్రసాద్, ఆనందరావు, రాంబాబు, బి.రాము, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఫిషింగ్ హార్బర్



ఫిషింగ్ హార్బర్‌లో కొనుగోలుదారులు

బీచ్ రోడ్డు, మార్చి 9, (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో మత్స్యకారుల వలలకు ఆదివారం పుష్కలంగా వివిధ రకాల చేపలు లభ్యమయ్యాయి. దీంతో మార్కెట్‌కు వచ్చే ప్రజలతో రద్దీతో నిండిపోయింది. ఎటు చూసినా చేపల రేవు కళకళలాడింది. ఎక్కువగా చేపలు, రొయ్యలు, కానాకడతలు, పారలు, తదితర పలు రకాల చేపలు అధిక సంఖ్యలో చిక్కాయి. వేల రూపాయలు విలువ చేసే ఈ మత్స్య రాశులను విక్రయించేందుకు ఫిషింగ్ హార్బర్‌కు తరలించారు. అధికంగా ప్రయోజనం చేకూరడంతో జాలర్లకు గిట్టుబాటు అయిందనే చెప్పొచ్చు

సముద్రంలో ఆటుపోట్లు ఎక్కువగా ఉండడంతో ఒడ్డు నుంచే వల వేసి చేపలను పట్టుకుని మార్కెట్‌లో కొనుగోళ్లు చేస్తుంటారు. ఆదివారం చేపల వేట నిర్వహించిన మత్స్యకారులకు తినడానికి వినియోగించని పలు సముద్ర జీవరాశులు చిక్కాయి, ముళ్ళ కంపలతో పాటు పసుపు రంగు పీతలు తదితర జాతుల మత్స్యరాశులు వలలో లభ్యమయ్యాయి.

జూ ఆదాయం రూ.2.26 లక్షల ఆదాయం

ఆరిలోవ, మార్చి9 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది, సుమారు రెండు వేల ఆరువందల నలభై రెండు మంది సందర్శకులు విచ్చేశారు. వీరి నుంచి సుమారు రూ.2.20 లక్షల ఆదాయం సమకూరినట్లు జూ అధికారులు తెలిపారు.

భీమిలి ఎమ్మెల్యే గంటాను కలిసిన 'గాదె'



ఎమ్మెల్యే గంటాను కలిసిన గాదె శ్రీనివాసులునాయుడు

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన గాదెశ్రీనివాసులు నాయుడు ఆదివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు నూతన ఎమ్మెల్సీని సాదరంగా ఆహ్వానించి శాలువా కప్పి అభినందించారు. అనంతరం శ్రీనివాసులు నాయుడు మీడియాతో మాట్లాడుతూ 2014-19లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో గంటా శ్రీనివాసరావు రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రిగా ఉపాధ్యాయుల సంక్షేమానికి జారీ చేసిన జీవోలే ఇప్పుడు తనను గెలిపించాయని పేర్కొన్నారు. గంటా నాయకత్వంలో పని చేయడం తనకెంతో సంతోషం కలిగించే విషయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర రవిద్యాశాఖా మంత్రి నారా లోకేష్ హయాంలో ఉపాధ్యాయులకు అంతా మంచే జరుగుతుందని గంటా భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు ఉపాధ్యాయ ప్రతినిధులు ఎం.శ్రీనివాస్, అల్లు సురేష్, టి మోహన్‌బాబు ఉన్నారు.

జిల్లా రెల్లికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఆకుల జైఆంధ్ర



ఆకుల జై ఆంధ్ర

మహారాణిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రెల్లి కులాల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షునిగా ఆకుల జై ఆంధ్ర నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన కృష్ణా జిల్లాలో జరిగిన రెల్లికుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కార్యవర్గాలను నియమించారు. జైఆంధ్రకు నియామక పత్రం అందజేశారు. కేజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న జైఆంధ్ర సంఘం ఉన్నతికి కృషి చేస్తానన్నారు.

స్టీల్‌ప్లాంటులో కాలిన కన్వేయర్ బెల్ట్



కాలిపోయిన కన్వేయర్ బెల్ట్

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు ఆర్ఎంహెచ్‌పీ (రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్)లోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంటులో శనివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో కన్వేయర్ బెల్ట్ కొంతమేర కాలిపోయింది. కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నుంచి బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగానికి పల్వరైజ్డ్ కోల్‌ను సరఫరా చేసే సీసీ 116 కన్వేయర్ బెల్ట్‌లో అకస్మాత్తుగా మంటలు రేగడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఇక్కడి నుంచి బీఎఫ్ విభాగానికి పల్వరైజ్డ్ కోల్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన బెల్టును పునరుద్ధరించారు. ఈ ప్రమాదం కారణంగా ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగలేదన్నారు.

జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు హ్యారీ మృతి



విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన జాతీయ ఫుట్‌బాల్, టెన్నిస్ మాజీ క్రీడాకారుడు హరిశ్చంద్ర పట్నాయక్ (88) ఆదివారం కన్నుమూశారు. హ్యారీగా పిలిచే హరిశ్చంద్ర ఏయూలో డిప్లమో చదువుతున్న సమయంలో 1962 అక్టోబరులో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ టోర్నీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అలాగే 1993-94లో భీమవరంలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ ఫుట్‌బాల్, టెన్నిస్ టోర్నీలో ఏయూ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఒకేసారి రెండు క్రీడాంశాలలో ఏయూ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఘనతను సాధించారు. కాల్టెక్స్ ఆయిల్ రిఫైనరీ ఇండియా లిమిటెడ్‌లో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. హ్యారీ మృతి పట్ల ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ మాజీ పీడీ పి.ఆర్.నారాయణస్వామి సంతాపం వ్యక్తం చేశారు.

ప్రయాణికుల అవగాహనకు రూట్‌మ్యాప్



రూట్‌మ్యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్ఎం, డిపో మేనేజర్లు

ద్వారకా బస్‌స్టేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు బస్సు రూట్లపై అవగాహన కల్పించేందుకు వీలుగా అన్ని ఆర్టీసీ బస్టాపుల్లో సిటీ బస్సు రూట్‌మ్యాప్‌లు ఏర్పాటు చేయనున్నారు. రూట్ల వివరాలు, రాకపోకలు సాగించే బస్సుల వివరాలు పొందుపరిచారు. ఈ మేరకు పోస్టర్లను ఆదివారం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడురీజనల్ మేనేజర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు ప్రవీణ (గాజువాక), అరుణకుమారి (మద్దిలపాలెం), పీబీఎంకే రాజు (మధురవాడ), గౌతమ్ చటర్జీ (స్టీల్‌సిటీ), గంగాధర్(విశాఖపట్నం), డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ రాజశేఖర్, పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు హ్యారీ మృతి

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన జాతీయ ఫుట్‌బాల్, టెన్నిస్ మాజీ క్రీడాకారుడు హరిశ్చంద్ర పట్నాయక్ (88) ఆదివారం కన్నుమూశారు. హ్యారీగా పిలిచే హరిశ్చంద్ర ఏయూలో డిప్లమో చదువుతున్న సమయంలో 1962 అక్టోబరులో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ టోర్నీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అలాగే 1993-94లో భీమవరంలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ ఫుట్‌బాల్, టెన్నిస్ టోర్నీలో ఏయూ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఒకేసారి రెండు క్రీడాంశాలలో ఏయూ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఘనతను సాధించారు. కాల్టెక్స్ ఆయిల్ రిఫైనరీ ఇండియా లిమిటెడ్‌లో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. హ్యారీ మృతి పట్ల ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ మాజీ పీడీ పి.ఆర్.నారాయణ స్వామి సంతాపం వ్యక్తం చేశారు.



ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ఉచితంగా గ్లకోమా పరీక్షలు

సీతంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కళ్లద్దాలు వాడుతున్నవారు, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా గ్లకోమా వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి సూచించారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో గ్లకోమా వారోత్సవాలను ఆదివారం ప్రారంభించామన్నారు. ఈ నెల 15 వరకు కొనసాగే వారోత్సవాల్లో వైద్య నిపుణులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ వాణిశ్రీలు గ్లకోమా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

మే నెలలో పరదేశమ్మ పండగ మహోత్సవం

అక్కయ్యపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రైల్వే న్యూకాలనీలోని పరదేశమ్మ అమ్మవారి పండగ మహోత్సవం మే నెలలో నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయ ఆవరణలో సమావేశమైన నిర్వాహకులు ఆలయ వార్షికోత్సవం, అన్న సమారాధనకు సహకరిస్తున్న ఆళ్ల నరసింగరావు, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, అనిల్ భవాని, జీఆర్కే రాజు, నూనెల పోలారావు, ఎస్.తాతాజీ, సంఘాల సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఇష్టంలేని వివాహం చేస్తున్నారని ద్వారకానగర్‌లో యువతి ఆత్మహత్య

సీతంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇష్టం లేని వివాహం చేస్తున్నారనే వేదనతో ఒక యువతి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ద్వారకానగర్ రెండో లైన్‌లో కామత్ హోటల్‌లోని సెల్లార్‌లో రామమూర్తినాయుడు అనే వ్యక్తి వాచ్‌మన్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆయన మూడో కుమార్తె పతివాడ ప్రమీల ఇంట్లోనే ఉంటోంది. ఆదివారం ఉదయం ప్రమీల తల్లి పని నిమిత్తం బయటకు వెళ్లింది. రామ్మూర్తి నాయుడు కూడా బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ప్రమీల ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు కుమార్తె ఆత్మహత్య చేసుకొని ఉండటాన్ని గమనించారు. మృతురాలి తండ్రి ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో వివాహం చేసుకోవడం ఇష్టం లేదన్న కారణంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు.

మాదక ద్రవ్యాల సేవనానికి వచ్చిన ముగ్గురు యువకుల అరెస్టు

మహారాణిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ వెనుక నిర్మానుష్య ప్రాంతంలో మాదక ద్రవ్యాలు సేవించేందుకు వచ్చిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు మహారాణిపేట పోలీసులు తెలిపారు. ఆదివారం సాయంత్రం అందిన పక్కా సమాచారంతో పోలీసులు ముందుగా మాటువేశారు. కొమ్మాది ప్రాంతానికి చెందిన పిఠాపురపు మనోజ్ (20), నమ్మి అభి (20), మహారాణిపేట వాసి అడపా గణేషులు అక్కడికి వచ్చి పోలీసులను చూసి పారిపోబోయారు. వీరిని పట్టుకుని పరిశీలించగా ఎమ్‌డిఎమ్‌ఏ డ్రగ్, గంజాయి లభ్యమైంది. గోవా వెళ్లి ఎమ్‌డిఎమ్‌ఈ డ్రగ్ కొని తీసుకొచ్చి ముగ్గురం జిల్లా పరిషత్ వెనుక తుప్పలలో కలిసి సేవించేవారిమని మనోజ్ పోలీసులకు తెలిపాడు. వీరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా రెల్లికుల సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఆకుల జైఆంధ్ర

మహారాణిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రెల్లి కులాల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షునిగా ఆకుల జైఆంధ్ర నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన కృష్ణా జిల్లాలో జరిగిన రెల్లికుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కార్యవర్గాలను నియమించారు. జైఆంధ్రకు నియామక పత్రం అందజేశారు. కేజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న జైఆంధ్ర సంఘం ఉన్నతికి కృషి చేస్తానన్నారు.



పచ్చని చెట్టుపై వేటు!

మద్రిపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మద్రిపాలెం ఎఫ్‌సీఐ కాలనీలో ఉన్న పెద్ద చెట్టును మొదలువరకు కోసివేయడంపై స్థానికులు, పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించారు. అయితే ఎఫ్‌సీఐ కాలనీలో కొమ్మలతోపాటు మొదలు వరకు చెట్టు తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కడ ఉన్న చెట్టు మొదలను చూసినవారు ఇంతగా ఎదగాలంటే సుమారు పదేళ్లు పడుతుందని, పచ్చని చెట్టుపై వేటు వేయడమేమిటని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పచ్చదనాన్ని పెంపునకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుపెడుతుంటే ఇలా నరికివేయడం దారుణమని విమర్శిస్తున్నారు. అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.


ఎఫ్‌సీఐ కాలనీ వద్ద...

వారు చూడరు.. వీరు మారరు!

మాధవధార, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అధికారులు వార్డుల్లో తిరుగుతూ గెడ్డలను పరిశుభ్రంగా ఉంచాలని అవగాహన కల్పిస్తుంటే, క్షేత్రస్థాయి యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తోంది. గెడ్డలో చెత్త కాదు..పెద్ద చెట్లను కూడా నరికేసి పడేస్తున్నారు. మాధవధార ఉడాకాలనీలో పద్మావతి పార్క్ దగ్గర ఇటీవల ఓ ఇంటి మరమ్మతుల నిమిత్తం అక్కడ ఏళ్లుగా పెరిగిన కొబ్బరి చెట్టును నరికి పార్కు ప్రవేశంలో కట్టిన కల్వర్టు కింద పడేశారు. కాలనీలో సంక్షేమ సంఘాలు గానీ, జీవీఎంసీ యంత్రాంగం, స్థానిక పారిశుధ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు కూడా ఈ గెడ్డల పరిరక్షణ అంశాన్ని పట్టించుకోవడం లేదు. ఉడాకాలనీ గ్యాస్ గోదాము రోడ్డులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతాల్లో జోరుగా కొనసాగుతున్న నిర్మాణ పనుల వల్ల భవన వ్యర్థాలు కూడా గెడ్డ అంచులో పడేసి, వాహనాల పార్కింగ్‌కి వాడుకుంటున్నారు. వ్యర్థాలను గెడ్డల్లో వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


గెడ్డలో పారేసిన చెట్టు దుంగలు

నర్సింగ్ సిబ్బంది సేవలు అమూల్యం

హోంమంత్రి వంగలపూడి అనిత కితాబు

మహారాణిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు ఎప్పుడూ మహారాణులుగానే నిలుస్తున్నారని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం కేజీహెచ్‌లోని ఆంధ్ర వైద్య కళాశాల సమావేశ ప్రాంగణంలో ప్రభుత్వ నర్సింగ్ సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హోం మంత్రి అనిత తొలుత కేకు కోశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఆసుపత్రికి వచ్చిన రోగులను కంటికి రెప్పలా చూసుకునే మహోన్నత వ్యక్తులు నర్సింగ్ సిబ్బంది అని ప్రశంసించారు. దేశ జనాభాలో మహిళలే ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వాలు వీరికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని హితవు పలికారు. మహిళల రక్షణకు ప్రభుత్వం శక్తి యాప్‌ను ప్రవేశపెట్టిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవి లతా, ఆర్ఎంవో మోహర్‌కుమార్, నర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు టి.గంగాభవానీ, కార్యదర్శి వరలక్ష్మి, టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, సౌత్ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు, నాయకులు పాల్గొన్నారు.


కేజీహెచ్‌లో హోంమంత్రి అనితను సత్కరిస్తున్న దృశ్యం

29వ వార్డులో మహిళకు సన్మానం

మహారాణిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేట 29వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం చందక వీధి సమావేశమందిరంలో పార్టీ వార్డు అధ్యక్షుడు ఉరుకూటి గణేష ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో సీనియర్ మహిళా నాయకులు, కార్యకర్తలను, చిరు మహిళా వ్యాపారులను సత్కరించి చీరలు పంపిణీ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ రాయన బంగారు రాజు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'హిందువులపై దాడిని పవన్ ఖండించాలి'

డాబాగార్డెన్స్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్ర స్వామి ఊరేగింపులో హిందువులపై ముస్లిం మతోన్మాదులు, పోలీసుల దాడిని సనాతన ధర్మ పరిరక్షకుడు పవన్‌కల్యాణ్ ఖండించాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్ఎల్ఎన్ వాసు డిమాండ్ చేశారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాడవీధుల్లో వీరభద్ర స్వామి ఊరేగింపు మసీదు వద్దకు రాగానే కొంత మంది ముస్లిం మతోన్మాదులు రెచ్చిపోయి విచక్షణ రహితంగా భౌతికదాడికి పాల్పడ్డారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే స్పందించి నిందితులపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో సునీల్ కుమార్, శంకర్, భార్గవ్, శ్యామ్ పాల్గొన్నారు..


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ వాసు

నీలమ్మ అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం

అల్లిపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అల్లిపురంలోని నీలమ్మ వేపచెట్టు అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం దేవదాయ శాఖ ఈఓ రమాబాయి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 6 వేల మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. అంతకుముందు అమ్మవారిని ఆయన దర్శించుకుని పూజలు చేశారు. కార్పొరేటర్ బీశెట్టి వసంతలక్ష్మి, జనసేన నాయకులు గోపీకృష్ణ, ఆకుల రాజు, భక్త సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.


అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

దుర్గాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద..

మహారాణిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరిగిన వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ దక్షిణఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాల్లో తలదూర్చొద్దు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐలు

సీతంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు జరుగుతున్నా తక్షణమే పోలీసులకు సమాచారం అందచేయాలని, సత్‌ప్రవర్తనతో మెలగాలని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్, ద్వారక పోలీసు స్టేషన్ల సీఐలు ఎ.సత్యనారాయణ, రమణలు రౌడీషీటర్లకు సూచించారు. ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు స్టేషన్ ఆవరణలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించి, గొడవల్లో తలదూర్చవద్దని విస్పష్టంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

భద్రతపై నర్సింగ్ సిబ్బందికి సూచనలు

మహారాణిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నేర నిరోధానికి తీసుకోవలసిన భద్రతా చర్యలపై కేజీహెచ్‌లో నర్సింగ్ విద్యార్థినులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ జి.డి.బాబు భద్రత, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. విద్య ప్రాముఖ్యత, సైబర్ నేరాలు, మంచి, చెడు స్పర్శ (గుడ్ టచ్, బ్యాడ్ టచ్), మద్యం, మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలు, ర్యాగింగ్ వంటి అంశాలపై వివరించారు. అనంతరం 'మీ కోసం మీ పోలీసు పోస్టర్‌ను హోం మంత్రి వంగలపూడి అనిత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కాళిదాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేకు సహకరించండి

జ్ఞానాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 సర్వేకు ప్రజలు సహకరించాలని జోన్-5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము కోరారు. జోన్‌లో ఉన్న అన్ని సచివాలయాల పరిధిలో సంబంధిత సచివాలయ కార్యదర్శులు ప్రతి ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాల నుంచి 27 ప్రశ్నలతో కూడిన వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పేదరికమే లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా పబ్లిక్, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో ఈ సర్వేకు ప్రభుత్వం రూపకల్పన చేసిందని పేర్కొన్నారు. సచివాలయ కార్యదర్శులకు తమ వివరాలు తెలిపి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


జోనల్ కమిషనర్ బి.రాము

రేపు పైడితల్లమ్మ ప్రధాన పండగ

కంచరపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్పీపేట గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పైడితల్లమ్మ ప్రధాన పండగను మంగళవారం నిర్వహించనున్నారు. అమ్మవారి ప్రధాన పండగకు హాజరయ్యే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్పీపేట రైల్వే గేటు వద్ద పుట్ట బంగారం గుడి, అమ్మవారి ప్రధాన ఆలయాలను నూతన రంగులు, విద్యుత్ కాంతులతో అలంకరణ చేశారు. సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం జరగనున్నది.

మాధవధారలో ఉచిత దంత వైద్య శిబిరం

మాధవధార, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 50వ వార్డు మాధవధారలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. మాధవ యువజన సమాజం ప్రాంగణంలో జరిగిన ఈ శిబిరంలో అనిల్ నీరుకొండ దంత వైద్యులు సేవలందించారు. సమాజం అధ్యక్షుడు రాంగోపాల్ మాట్లాడుతూ స్థానిక వైద్యులు బి.యుక్తాముఖి నిర్వహణ బాధ్యతలు చేపట్టి శిబిరాన్ని విజయవంతం చేశారని అన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య సేవల్ని వినియోగించుకున్నారు. వైద్యులు ప్రహర్ష, వినీల, వసుంధర తదితరులు హాజరయ్యారు. స్థానిక కార్పొరేటర్ వి.ప్రసాద్, ఆనందరావు, రాంబాబు, బి.రాము, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


దంత పరీక్షలు చేస్తున్న వైద్యనిపుణులు

వైశాఖీ స్పోర్ట్సు పార్క్‌లో..

మురళీనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వనితా వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వైశాఖీ స్పోర్ట్సు పార్క్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ ఆసుపత్రి వైద్యులు భరత్, కిషోర్, గణేష్‌లు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సూచనలు చేశారు. వనితా వాకర్స్‌క్లబ్ ప్రెసిడెంట్ పి.ప్రభావతి, 50వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ తదితరులు నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాధవధార, ఎస్‌జీజీఓస్ కాలనీ, మురళీనగర్ ప్రాంతాల ప్రజలు హాజరయ్యారు.

బచేలి-కిరండూల్ డబ్లింగ్ లైనులో రైళ్ల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్


సంప్రదింపులు జరుపుతున్న రైల్వే ఉన్నతాధికారులు

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్‌లోని బచేలి, కిరండూల్ సెక్షన్‌లో పూర్తయిన 9.143 కి.మీ డబ్లింగ్ లైనులో రైళ్ల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. సౌత్ ఈస్టర్న్ సర్కిల్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ బ్రిజేష్‌కుమార్ మిశ్రా ఆదివారం తనిఖీలు చేపట్టి ట్రయిల్ రన్ నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు. తనిఖీలో భాగంగా ట్రాక్ సామర్థ్యం అంచనా వేశారు. కొత్త సిగ్నలింగ్ వ్యవస్థ నిర్మించిన వంతెనలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం నిర్వహించిన స్పీడ్ ట్రయిన్ రన్ విజయవంతమైంది. ఈ లైను అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఇనుప ఖనిజం రవాణా సామర్థ్యం మరింత పెరగనుంది. వాల్తేరు డివిజన్ పురోగతికి నిదర్శనంగా నిలిచిన ఈ డబ్లింగ్ లైను ప్రారంభించడం ద్వారా రైలు కనెక్టివిటీ సామర్థ్యం పెరగడమే కాకుండా ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గౌతమ్ శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్లు ధనుంజయరావు, గౌరీ శంకరరావు, మంజిత్ సింగ్, కె.ఎస్.వర్మ, డిప్యూటీ సీఆర్ఎస్ అశుతోష్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కెమికల్ విద్యార్థులకు బహుమతులు


బహుమతులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ

కంచరపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా ఆదివారం అనకాపల్లిలో డిపార్టుమెంట్స్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ పాఠశాలలు,కళాశాలలు,ఐటీఐ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కంచరపాలెం ప్రభుత్వకెమికల్ కళాశాల్లో చదువుచున్న టి.స్వామినాథన్‌కు భద్రత నినాదాలు(తెలుగులో), ప్రథమ బహుమతి,భద్రతా నినాదాలు (ఆంగ్లంలో) ఎన్.సాగర్ కుమార్‌కు ద్వితీయ బహుమతి,జి.కుసుమ కు వర్క్‌షాపుమిషనరీ సేఫ్టీలో చిత్రలేఖనంలో ద్వితీయ బహుమతి లభించింది.ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాలప్రిన్సిపాల్ డా.కేవీ.రమణతో పాటు కెండోసా అధ్యక్షుడు ఎ.వరహాలు అభినందించారు.

కరాటే మాస్టర్‌కు సన్మానం

మురళీనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మాధవధారలో దశాబ్దాలుగా ఆత్మరక్షణ విద్య (కరాటే)లో పలువుర్ని నిష్ణాతులుగా తీర్చిదిద్దిన సీనియర్ కోచ్ డి.ఎల్లారావును ఆదివారం 51వవార్డు ఈస్ట్ పార్క్ కమిటీ సభ్యులు ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్క్ కమిటీ అధ్యక్షుడు మురళీ, సభ్యులు, రిటైర్డ్ జీవీఎంసీ పాఠశాల పీఈటీ పి.అప్పారావు తదితరులు హాజరయ్యారు. ఎల్లారావు పలువురికి ఫీజు లేకుండా తన విద్యను గురువుగా ఎలాంటి లోపం లేకుండా నేర్పి వారికి బ్రతుకు దెరువు కల్పించడమే కాకుండా, పలువురు ఈయన శిక్షణతో రాణించి ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాల్లో స్థిరపడ్డారని అభినందించారు. కార్యక్రమంలో స్థానికులు, విద్యార్థులు, పార్క్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ డీలర్లు!

... 5వ పేజీ తరువాయి

జారీచేయకుండా ఒకే వ్యక్తికి నాలుగు దుకాణాలు కేటాయించారు. ఇలాంటి సందర్భాలలో ఒరిజినల్ డీలరు వేలిముద్రలు తొలగించి నకిలీ వ్యక్తి వేలిముద్ర వేయిస్తున్నారు. శ్రీహరిపురం ప్రాంతంలో డిపో నంబరు 286పై విజిలెన్స్ అధికారులు దాడి చేసిన తరువాత ఆ డిపోను తాత్కాలికంగా మరొకరికి అప్పగించారు.

వెలుగులోకి రానివి ఎన్నో...

నగరంలో చాలా రేషన్ డిపోలు ఒరిజినల్ డీలర్లకు బదులు నకిలీ వ్యక్తులు నిర్వహిస్తున్నారు. విచిత్రమేమిటంటే ఒరిజినల్ డీలరుతో సంబంధంలేకుండా వారి వేలిముద్రలతో డూప్లికేట్ వేలిముద్రలు తయారుచేసి ప్రతి నెలా సరకులు విడుదల చేస్తున్నారు. ఈ లెక్కన కొందరు వ్యక్తులు రెండు అంత కంటే ఎక్కువ డిపోలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం పౌరసరఫరాల శాఖలో అందరికీ తెలుసు. ప్రధానంగా చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, గోదాముల వద్ద సరుకు విడుదలచేసే ఇన్‌చార్జి, ఇతర ఉద్యోగులకు నెలవారీ మామ్మూళ్లు అందుతాయి. రెండువారాల క్రితం కురుపాం మార్కెట్ ఏరియాలో బియ్యం అమ్మకాల్లో గొడవ సందర్భంగా ఒక డీలరుపై ఇద్దరు బినామీ డీలర్లు దాడిచేశారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టలేదు.

ఏళ్ల కిందట సొసైటీల పేరిట రేషన్ డిపోలు తీసుకున్న కార్యవర్గాలు ఇప్పుడు మనుగడలో లేవు. అయినా పౌరసరఫరాల శాఖలో కొందరి ప్రమేయంతో ఆయా డిపోలను కొందరు సొసైటీ సభ్యుల పేరుతో నిర్వహిస్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి మార్చిలో రేషన్ డిపోలు అథంటికేషన్ (డిపో రెన్యువల్) చేస్తారు. పౌరసరఫరాల శాఖలో ఉన్న అథంటికేషన్ రిజిస్టర్‌లో ఉన్న వివరాలు, గతంలో నోటిఫికేషన్ ద్వారా డీలర్లుగా ఎంపికైన వారి వివరాలతో రెన్యువల్‌కు వచ్చే వారి వివరాలను సరిపోల్చి వేలిముద్రలు తీసుకుంటే బినామీ/నకిలీలకు చెక్ పడుతుందని పలువురు డీలర్లే పేర్కొంటున్నారు.

కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీ

... 5వ పేజీ తరువాయి

ఇలాంటి వ్యవహారాలు వెలుగులోకి వస్తాయి. కానీ ఆ దిశగా చర్యలు లేవు.

చివరి దశలో కేజీహెచ్‌కు..

కేజీహెచ్‌లో ప్రతిరోజూ చికిత్స పొందుతూ మృతి చెందే రోగుల్లో దాదాపు 80 శాతం కేసులు ప్రైవేటు/ కార్పొరేట్ ఆస్పత్రుల నుంచి వచ్చినవేనని అధికారులు చెబుతున్నారు. అప్పటికే చేయి దాటిపోవడంతో తామేమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతోందని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కేజీహెచ్‌లో మృతుల సంఖ్య అధికంగా కనిపిస్తోందని, దానికి ఇదే ప్రధాన కారణమంటున్నారు.

బైక్ రేసింగ్‌లపై సీపీ దృష్టి

... 5వ పేజీ తరువాయి

రాత్రి సమయంలో మానసిక ఆస్పత్రిరోడ్డులో బైక్‌రేసింగ్‌లకు పాల్పడుతున్నట్టు పోలీసులు గుర్తించి 38 మంది రేసర్లను అదుపులోకి తీసుకోవడంతో పాటు 38 ద్విచక్రవాహనాలను స్వాధీనం తీసుకున్నారు. అలాగే ఈనెల ఏడో తేదీన సిరిపురం కూడలి పరిసరాల్లో రేసింగ్ నిర్వహిస్తున్న మరో 18 మంది పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి బైక్‌లను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదుచేశారు. పట్టుబడిన యువకుల తల్లిదండ్రులను పిలిపించి, కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇలాంటి రేసింగ్‌లు నగరంలో బీచ్‌రోడ్డుతోపాటు బీఆర్‌టీఎస్‌రోడ్డు, మారికవలస నుంచి ఐటీ హిల్స్‌కు వెళ్లేరోడ్డు, రుషికొండ, తిమ్మాపురం బీచ్‌రోడ్డులో ఎప్పటికప్పుడు జరుగుతుంటాయని పోలీసులే చెబుతున్నారు.

వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం

రేసింగ్‌కు పాల్పడేవారంతా వాట్సాప్, ఇన్‌స్టాల్లో గ్రూపులుగా ఏర్పడి రేసింగ్ ఎక్కడ నిర్వహించేదీ సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నారు. ఒక్కొక్కరుగా అక్కడికి చేరుకుని పోలీసుల రాకను గమనించి జిగ్‌జాగ్‌లు, స్పీడ్ డ్రైవింగ్, స్టంట్‌లు వంటి వాటిపై పోటీలు పెట్టుకుంటున్నారు. ఆ సమయంలో అదే రోడ్డుపై వెళ్లే వాహనచోదకులు వారిని చూసి ఆందోళనకు గురై ప్రమాదాల బారిన పడిన సందర్భాలు కూడా ఉన్నాయని పోలీసులే చెబుతున్నారు. యువత ప్రాణాలను బలిగొంటున్న రేసింగ్‌లపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని నగరవాసులు కోరుతున్నారు.

నేడు ఆర్‌జేసీఎల్‌తో కార్మిక నేతల సమావేశం

ఉక్కు టౌన్‌షిప్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై సోమవారం ఆర్‌జేసీఎల్ (రీజనల్ జాయింట్ కమిషనర్ ఫర్ లేబర్) సమక్షంలో యాజమాన్యం, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకుల మధ్య కీలక సమావేశం జరగనుంది. ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 7న కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేపట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆర్‌జేసీఎల్‌తో 11న సమావేశం నిర్వహించనున్న క్రమంలో సమ్మెను వాయిదా వేశారు. అయినా గత మూడు రోజులుగా ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును యాజమాన్యం చేపట్టింది. ఈ క్రమంలో జరగనున్న సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకనుగుణంగా భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

అగనంపూడి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి గల్లవానిపాలెంలో లయన్స్ క్లబ్, ముత్యాలహారం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని స్థానిక నేత బలిరెడ్డి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రక్తదాన ప్రాణదానంతో సమానమన్నారు. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో బలిరెడ్డి నాగేశ్వరరావు, పట్టా రామ అప్పారావు, మస్తాన్‌రెడ్డి, కళాదాసు, హనుమంతురావు, తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌లో స్వచ్ఛభారత్

అగనంపూడి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి రహదారిలోని వాకింగ్ ట్రాక్‌పై ఆదివారం స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. క్లబ్ సభ్యులంతామైదానంలో చెత్తతో పాటు ప్లాస్టిక్ సీసాలు, పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలిగించారు. వాకింగ్‌కు వచ్చే వారంతా మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మాడుగుల నరసింగరావు, బలిరెడ్డి నాగేశ్వరరావు, కరణం పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సలీం జీ పురుషోత్తమన్

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా సలీం జీ పురుషోత్తమన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బ్రైత్‌వెయిట్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. 1983లో బొకారో సెయిల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరిన పురుషోత్తమన్ డైరెక్టర్ స్థాయికి చేరుకున్నారు. ప్లాంట్‌ను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపిస్తామన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 14, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 44, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 40, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12, క్యారెట్ 26 దొండకాయలు 40, బంగాళ దుంపలు 15, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 60, అల్లం 50, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోసకాయలు 26, వెల్లుల్లి 110, కొబ్బరికాయ 25, బీన్స్ 54, కీరదోస 28, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170



రాసాలమ్మ అమ్మవారి ఆలయంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, నేతలు



ఉక్కు టౌన్‌షిప్‌లో పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

వాడవాడలా సందడిగా దేవతా ఉత్సవాలు

కూర్మన్నపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వాడవాడలా ఆదివారం అమ్మవారి ఉత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. జీవీఎంసీ 86వ వార్డు రాసాలమ్మ కాలనీలో 13వ వార్షిక మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకుడు భమిడిపాటి రామశర్మ పర్యవేక్షణలో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ, జనసేన వార్డు ఇన్‌చార్జి కాదా శ్రీను పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా శ్రీకృష్ణుని కల్యాణ మహోత్సవం

జీవీఎంసీ 71 వార్డు శ్రీనగర్‌లో శ్రీకృష్ణ గోవర్ధన గిరి టెంపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి భూషణశర్మ, జాడా శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో విజయ గణపతి,రమా సత్యనారాయణ స్వామి శ్రీకృష్ణ గోవర్ధన గిరి ఆలయంలో సప్తమి వార్షికోత్సవం జరిగింది. రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మూలమంత్ర హోమాలు చేశారు. మహిళలు భక్తి గీతాలు ఆలపించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ రాజాన రామారావు, జనసేన నేత కరణం కనకారావు, అక్కిన లక్ష్మణరావు, ఆవాల సూర్యనారాయణ, కరేటి సహదేవుడు, బోయిన లక్ష్మణ రాజు, శ్రీనివాసరాజు, పంచముఖేశ్వరరావు, వరలక్ష్మి, చెల్లయ్య, రామారావు, బాబ్జీ, ప్రసాద్ పాల్గొన్నారు.

త్రిశక్తి ఆలయం ప్రథమ వార్షికోత్సవం

జీవీఎంసీ 87వ వార్డు లక్ష్మీపురందుర్గాలమ్మ, నూకాలమ్మ, పోలిపల్లమ్మ అమ్మవార్ల ఆలయ ప్రథమ వార్షిక మహోత్సవాలు ఘనంగా జరిగాయి. అర్చకులు ఇరగవరపు వాసు, శ్రీధర్ పర్యవేక్షణలో పంచామృతాభిషేకాలు, సకల దేవతా మంత్ర హోమాలు, శ్రీచక్రనవావర్ణార్చన నిర్వహించారు. కార్పొరేటర్ బొండా జగన్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అవిరెడ్డి సూర్యనారాయణ, కుచ్చర్లపాటి రామరాజు, సిరసపల్లి బాబూరావు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చింతాలమ్మ జాతర

అగనంపూడి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తిలో చింతమ్మ అమ్మవారి జాతర సోమవారం నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం అనుపోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. జాతరను పురస్కరించుకుని రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-1లోని వెంకటేశ్వర స్వామి ఆలయ 34వవార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఆదివారం ఆలయంలో వైదిక సదస్యం, సుదర్శన హోమం, పండిత సదస్యం చేపట్టారు.

తోటపోలమాంబ అమ్మవారి పరస

ఎన్‌ఏడీ జంక్షన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బాజీజంక్షన్ ఎస్సీ కాలనీలోని తోటపోలమ్మ పరస మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు జరిపారు. పరిసర ప్రాంతాల భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

వేపగుంట మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేపగుంట పరిసర ప్రాంత భక్తుల ఆరాధ్య దేవత ముత్యాలమ్మ పండగ పురస్కరించుకుని ఆదివారం రాత్రి 250 మంది విద్యార్థులు చేసిన కూచిపూడి నృత్యం అలరించింది. పెందుర్తికి చెందిన డ్యాన్స్ టీచర్ మీనా బృంద సభ్యులు, చిన్నారులు చేతిలో దీపాలతో నృత్యం చేసి అబ్బురపరిచారు.


కనకదుర్గ ఆలయ ద్వారం ప్రారంభోత్సవం

సింధియా, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63 వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో ఆదివారం కనకదుర్గ నూతన ఆలయ ముఖద్వారం ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాస్ మంత్రోచ్ఛరణల మధ్య జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

నవదుర్గ ఆలయ ప్రారంభోత్సం

మల్కాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ సంజీవ్ కాలనీ నవదుర్గ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు. మూడురోజులుగా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలో ఇకపై ప్రతిరోజు ప్రత్యేక పూజలు చేపడతామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

మే 11 నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు



పాడేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోదకొండమ్మ ఉత్సవాలను ఈ ఏడాది మే నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం మోదకొండమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ప్రకటించారు. ప్రతి ఏడాది మే నెలలో మోదకొండమ్మ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. అందుకు గాను ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ప్రధాన కార్యదర్శి కిల్లు కోటినాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నేతలు, గ్రామపెద్దలు, వర్తక సంఘం నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు ప్రధానార్చకుడు సుబ్రహ్మణ్యం ముహూర్తం పెట్టారు. దీంతో మే నెల 11, 12, 13 తేదీల్లో ఉత్సవాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటినాయుడు, టూరిజం డైరెక్టర్ కేవీ రమేశ్‌నాయుడు, ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రాజకీయ నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటులో కాలిన కన్వేయర్ బెల్ట్



కాలిపోయిన కన్వేయర్ బెల్ట్

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు ఆర్‌ఎంహెచ్‌పీ (రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్)లోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంటులో శనివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో కన్వేయర్ బెల్ట్ కొంతమేర కాలిపోయింది. కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నుంచి బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగానికి పల్వరైజ్డ్ కోల్‌ను సరఫరా చేసే సీసీ 116 కన్వేయర్ బెల్ట్‌లో అకస్మాత్తుగా మంటలు రేగడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఇక్కడి నుంచి బీఎఫ్ విభాగానికి పల్వరైజ్డ్ కోల్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన బెల్టును పునరుద్ధరించారు. ఈ ప్రమాదం కారణంగా ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగలేదన్నారు.

రజక సంఘానికి కుర్చీల వితరణ



కుర్చీలు అందిస్తున్న గోపిశెట్టి ఆదినారాయణ

అక్కిరెడ్డిపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రజకులు తమ సమస్యల పరిష్కారానికి పార్టీలకతీతంగా సమష్టిగా ఉండాలని ప్రముఖ పారిశ్రామికవేత్త గోపిశెట్టి ఆదినారాయణ సూచించారు. అక్కిరెడ్డిపాలెం రజక సంఘం ఆధ్వర్యంలో కాలనీలో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు సంద్రాన గణేశ్, నీహారిక దంపతులు అందచేసిన 32 కుర్చీలను ఆదినారాయణ రజక సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు బొడ్డు వెంకటరమణ, కామాడ రాంబాబు, సంద్రాన గణేష్, నీహారిక తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణాన్ని అడ్డుకున్నాం

» పెదగంట్యాడ తహసీల్దార్ అమల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గాజువాక బీసీరోడ్డును ఆనుకుని దయాల్‌నగర్ కొండ సమీపంలో సర్వేనంబరు 43/1డీలోని ప్రభుత్వభూమిని కలిపేసి చేపట్టిన కల్యాణ మండపం నిర్మాణాన్ని గతంలోనే అడ్డుకున్నామని పెదగంట్యాడ తహసీల్దార్ అమల తెలిపారు. దయాల్‌నగర్ కొండ సమీపంలో ప్రభుత్వభూమిని ఆక్రమించి వైసీపీ నేత కుమారుడి అండదండలతో కల్యాణ మండపం నిర్మిస్తుండడంపై 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై తహసీల్దార్ వివరణ ఇస్తూ కల్యాణ మండపం నిర్మిస్తున్న స్థలంలో సుమారు 150 గజాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఆ విషయాన్ని గుర్తించి గతంలో నిర్మాణాన్ని తొలగించానన్నారు. దీనిపై నిర్మాణదారుడు కోర్టు స్టే ఆర్డర్ తెచ్చుకోవడంతో దాని జోలికి వెళ్లలేదన్నారు. తాజాగా నిర్మాణం జరుగుతున్న విషయం తనకు తెలియదని, నిర్మాణం తిరిగి ప్రారంభిస్తే న్యాయపరంగా ప్రభుత్వ భూమిని కాపాడుకుంటామన్నారు.

కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే నిరవధిక సమ్మె

» అఖిలపక్ష కార్మిక సంఘ నాయకుల హెచ్చరిక



ధర్నాలో అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు

గాజువాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియను నిలిపివేయకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు హెచ్చరించారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు నిరసనగా ఆదివారం పాతగాజువాకలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్లాంట్ యాజమాన్యం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. గత 30ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఇప్పుడు తొలగించడం సరికాదన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదని, ప్లాంట్‌ను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరాం, జగ్గునాయుడు, సత్యనారాయణ, డి.ఆదినారాయణ, పీవీ రమణమూర్తి, మంత్రి రవి, రమణ, వంశీ, పులి రమణారెడ్డి, కేఎం.శ్రీనివాస్, ఎస్.రామారావు, నాయకులు పాల్గొన్నారు.

సత్యసాయి భక్త బృందం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

పెందుర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ సత్యసాయి భజన భక్తబృందం ఆధ్వర్యంలో ఆదివారం ఆనందసాయి మందిరంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్పొరేటర్లు ముమ్మన దేవుడు, సేనాపతి వసంత శంకరరావు, జనసేన నేత కంచిపాటి మధు శిబిరాన్ని ప్రారంభించారు.

ప్రయాణికుల అవగాహనకు రూట్‌మ్యాప్



రూట్‌మ్యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్, డిపో మేనేజర్లు

ద్వారకాబస్‌స్టేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు బస్సు రూట్లపై అవగాహన కల్పించేందుకు వీలుగా అన్ని ఆర్టీసీ బస్టాపుల్లో సిటీ బస్సు రూట్‌మ్యాప్‌లు ఏర్పాటు చేయనున్నారు. రూట్ల వివరాలు, రాకపోకలు సాగించే బస్సుల వివరాలు పొందుపరిచారు. ఈ మేరకు పోస్టర్లను ఆదివారం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడురీజనల్ మేనేజర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్లు ప్రవీణ (గాజువాక), అరుణకుమారి (మద్దిలపాలెం), పీబీఎంకే రాజు (మధురవాడ), గౌతమ్ చటర్జీ (స్టీల్‌సిటీ), గంగాధర్(విశాఖపట్నం), రాజశేఖర్, పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

మల్లుదొర వారసుడు గాం బోడి దొరకు ఘన నివాళి

పెదగంట్యాడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, మల్లుదొర వారసుడు గాం బోడి దొర వర్ధంతిని ఆదివారం 65వ వార్డు భానోజీ తోటలో నిర్వహించారు. విశాఖ అల్లూరి గాం గంటం, మల్లు దొరల సేవాసంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు గాంబోడి దొర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సంఘం ప్రతినిధులు శివంగి నాగేశ్వరరావు, కర్రి కృష్ణ, వెంకటేశ్వరరావు, శుక్ల, కామేశ్వరరావు, ఉమాశంకర్, భాస్కర్ పాల్గొన్నారు.

పార్కులో విద్యుదీకరణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

ఎన్‌ఏడీజంక్షన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 90వ వార్డు బాజీజంక్షన్ దరి సంత వెనకనున్న పంచతత్వ పార్కులో జీవీఎంసీ నిధులు రూ.15.22లక్షలతో చేపట్టనున్న విద్యుదీకరణ పనులకు ఆదివారం కార్పొరేటర్ బొమ్మిడిరమణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులో సీనియర్ సిటిజన్స్ రాత్రి, ఉదయం వేళ నడవటానికి పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సత్యసిరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సంతోషి, సీతారామ్, కుమార్ దేవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత



చెక్కులు అందుకున్న వారితో టీడీపీ నేతలు

గాజువాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలను ఆదుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ గ్రాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుగురు లబ్ధిదారులకు రూ. 7 లక్షల విలువైన చెక్కులు అందచేసినట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోగంటి లెనిన్‌బాబు, నమ్మి సింహాద్రి, కరణం సత్యారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధురాలు

పెందుర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి); మనుమడి ఇంటి నుంచి బయటికి వెళ్లి తప్పిపోయిన వృద్ధురాలి ఆచూకీని పెందుర్తి పోలీసులు అరగంటలో గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. చోడవరం మండలం గోవాడకు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు సుజాతనగర్‌లో మనుమడి ఇంటికి వచ్చింది.మధ్యాహ్నం బయటకి వెళ్లి దారి తప్పిపోయారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆమెను పార్క్ సమీపంలో గుర్తించిన బంధువులకి అప్పగించారు.

రాష్ట్రంలో పరుగులు పెడుతున్న అభివృద్ధి

» గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



కమ్యూనిటీహాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, మార్చి9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. విజన్ 2047తో రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం ప్రగతి దిశగా నడిపిస్తోందన్నారు. జీవీఎంసీ 75 వ వార్డులో రూ.35లక్షలతో నిర్మించిన శాఖాగ్రంథాలయ అదనపు భవనాన్ని, నెల్లిముక్కులో రూ.30లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలును ఆదివారం ఆయన ప్రారంభించారు. సీతానగరం ఎస్సీ కాలనీ, రజకవీధి ప్రాంతాలకు తాగునీరందించేందుకు నూతన పైపులైన్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నెల్లిముక్కు రామాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో పల్లా మాట్లాడుతూ ప్రజావసరాలను గుర్తించి సాకారం చేసే దిశగా పనులు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, దల్లి గోవిందరెడ్డి, నేతలు ప్రసాదుల శ్రీనివాస్, పులి వెంకటరమణారెడ్డి, నమ్మి అప్పారావు, జనసేన నేత కోన చినఅప్పారావు, పీవీ రమణ, వంశీ, పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కేటీబీ నాయకులు

గాజువాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గాజువాక శ్రీకృష్ణ దేవరాయ సంక్షేమ సేవా సంఘం (కేటీబీ) సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి సమస్యలను విన్నవించారు. పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, కల్యాణ మండపం నిర్మించామని తెలిపారు. కేటీబీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజాన రామారావు, కరణంరెడ్డి నరసింగరావు, శంకరరావు, నీరుకొండ రామచంద్రరావు, కనకారావు, మహాలక్ష్మి పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ గాజువాక సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

EP 17/2022 in OS 220/2018

Between
చెకూరి చినరాజన్ రాజు ...DHR/వాది
Between
గాదిరాజు జగన్నాథరాజు (లేటు)
గాదిరాజు వరలక్ష్మి
గాదిరాజు దివ్యమౌనిక ...JDRS/ప్రతివాదులు

పై నెంబరు EP 17/2022 లో పిటిషనర్/DHR కు రావలసిన బాకీ నిమిత్తం Respondent/JDRS కు చెందిన యీ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తే.27-3-2025 దిన ఉదయం గం.10.30 ని.లకు లగాయతు పై కోర్టు వారి ఆవరణలో సదరు షెడ్యూలు ఆస్తిని వేలం వేయుదురు. కనుక సదరు ఆసక్తి ఉన్నవారు సదరు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు ఆస్తి వివరం

All that Piece and Parcel of Site measuring 38.46 sq.yds. or 32.157 sq.mts. being undivided and unspecified share out of total extent 769.38 sq.yds. or 643.301 sq.mts. together with newly constructed flat bearing No.402 with plint area of 1165 sft. (including common area) in 4th floor of Harisha Victorious covered by S.No.186 Part of China Gantyada village within the limits of GVMC, Gajuwaka Mandal, SRO Peda Gantyada, Visakhapatnam, bounded as follows : East: 30 ft. wide Road, South: Building of Munna & Chowdary, West: Building of Y.Meenakshi, North: 20 ft. wide Road.

Boundaries of Flat No.402 4th Floor: East: 130 ft. wide Road, South: Common Corridor, West: Lift and Common Corridor, North: 20 ft. wide Road.

DHR Value: 8,90,000/- (Approximately)
Amin Value : 25,00,000/-
Gajuwaka
Date: 10-03-2025

G. CHIRANJEEVI, Advocate
Flat No.502, Nakshatra Gardens, Gavara Jaggayyapalem, Sheela Nagar, BHPV Post, Visakhapatnam-530012. Cell: 9948674893

సిడ్నీ తెలుగు సీనియర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు తదితరులు

ఎన్‌ఏడీజంక్షన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):మర్రిపాలెం ఉడా లేఅవుట్‌లో ఆదివారం ఆస్ట్రేలియాలో తెలుగు సీనియర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎం.వాసుదేవరావు, డీవీ సాయిబాబా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొని మాట్లాడారు. ఆస్ట్రేలియాలో ఉన్న సీనియర్ సిటిజన్లందరి వివరాలను సేకరించి, వారి ఫొటోలు, చిరునామాలతో తీర్చిదిద్దిన డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా గణబాబు ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్‌బోర్న్ తదితర ప్రాంతాలు అందంగా ఉంటాయని, గతంలో వాలీబాల్ టోర్నమెంట్‌కు వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. 250 మందివివరాలతో కూడిన డైరీని రూపొందించిన హైదరాబాద్‌కు చెందిన పీఆర్ విజయకుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలోబి.మల్లికార్జునరావు, జె.సుధాకర్, జి.మురళీమోహన్, ఎ.శ్రీరాములు, ఆర్.అప్పారావు, కోటేశ్వరరావు, రాధాకృష్ణ, టి.బి.రాజేంద్రప్రసాద్, ఉపేంద్ర వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జనసేన పీఏసీ సభ్యుడు తాతారావు

గాజువాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ సభ విజయవంతానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలని పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ సభ పోస్టర్‌ను ఆదివారం గాజువాకలో ఆవిష్కరించి మాట్లాడారు. పిఠాపురంలో జరగనున్న సభకు గాజువాక నుంచి భారీగా హాజరుకావాలని కోరారు. ఈ మేరకు బస్సులు, కార్లు ఏర్పాటు చేశామన్నారు. పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్నారన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, నేతలు కరణం కనకారావు, మునలయ్య, కోన చినఅప్పారావు, జ్యోతిరెడ్డి, శాలిని, మురళీదేవి పాల్గొన్నారు.